J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 46 సంచిక : 21 23.10.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# పార్టీల పాపం.. ప్రజలకి శాపం!

- స్థానిక ఎన్నికల్లో పెచ్చుమీరుతున్న హింస
- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న అధికార, ప్రతిపక్షాలు
- నిస్తేజంగా మారుతున్న అధికార గణం
- దొందూదొందే అంటున్న జనం

పోటాపోటీ ప్రదర్శనలు, ప్రత్యర్థులపై బూతు పురాణాలు, తిట్లదండకం, రాళ్లదాడులు, కొట్లాటలు, తన్నుకోవడాలు, తగలబెట్టుకోవడాలు, రక్తపాతాలు, విధ్వంసాలు, రణరంగాలు. ఇదేదో యుద్ధభూమిలోనో, శత్రుదేశాల సరిహద్దుల్లోనో అనుకుంటే పొరపాటే. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యంగా ఫరిడవిల్లుతున్న మనదేశంలో, ముఖ్యంగా ఒకప్పుడు ప్రశాంతతకి మారుపేరైన మన తెలుగు రాష్ట్రం నవ్యాంధ్రలో ప్రస్తుతం జరుగుతున్న తంతు. ఇక్కడ స్థానిక సంస్థల ఎన్నికలు ఓ ప్రహసనంగా మారాయంటే అతిశయోక్తి కాదు. అధికార మత్తులో ఒకరు, గతంలో తాము చేసిన దుర్మార్గాలను మరిచి మరొకరు, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. అధికార, ప్రతిపక్షమనే తేడా లేకుండా ప్రజలను మభ్యపెడుతూ పబ్బం గడుపుకుంటున్నారు. 2లో

## ఆంధ్రాలో మారని స్థాని'కథ'



## పురపోరుకి తాత్కాలిక బ్రేక్! 2లో

- సుప్రీం నిర్ణయంతో.. ఖంగుతిన్న అధికార కూటమి
- నవంబర్ 1న మున్సిపల్ ఎన్నికలు జరిగే అవకాశం

### ఆశావహులకు అగ్ని పరీక్ష

# 'నే'తల'రాతలు' మార్చనున్న స్థానిక సమరం!

- గెలుపోటములపైనే నేతల రాజకీయ భవిత
- కూటమి పార్టీలకి సమన్వయ సవాలు
- వైఎస్సార్‌సీపీకి ఉనికి పోరు

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు మరోసారి కీలక చర్చకు తెరలేపుతున్నాయి. పంచాయతీలు, మున్సిపాలిటీల్లో పట్టు సాధించేందుకు రాజకీయ పార్టీలు సన్నద్ధమవుతున్నాయన్న సంకేతాల నేపథ్యంలో ఈ ఎన్నికలు కేవలం గ్రామ, వార్డు స్థాయి ప్రజాప్రతినిధుల ఎంపికకే పరిమితం కాకుండా, రాష్ట్రస్థాయి నేతల రాజకీయ భవితవ్యానికి కూడా అగ్నిపరీక్షగా మారనున్నాయనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గాల్లో తమ పట్టు ఎంత బలంగా ఉంది? పార్టీ శ్రేణులను ఎంతవరకు సమన్వయం చేయగలుగుతున్నారు? ప్రజల్లో ప్రభుత్వంపై, ప్రతిపక్షంపై ఎలాంటి అభిప్రాయం ఉంది? వంటి అంశాలకు స్థానిక ఫలితాలు అద్దం పట్టే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే నే'తల'రాతలు మార్చనున్న స్థానిక సమరం' అంటూ రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది.

స్థానిక ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించిన నాయకులకు పార్టీ అధిష్ఠానాల వద్ద ప్రాధాన్యం పెరగవచ్చన్న అంచనాలు ఒకవైపు, ఆశించిన స్థాయిలో ఫలితాలు రాబట్టలేని నేతలు తమ రాజకీయ వ్యూహాలను సమీక్షించుకోవాల్సి రావచ్చన్న అభిప్రాయాలు మరోవైపు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రులు, సీనియర్ ఎమ్మెల్యేలు, మంత్రి పదవులను ఆశిస్తున్న నాయకులకు ఈ ఎన్నికలు తమ సామర్థ్యాన్ని నిరూపించుకునే వేదికగా మారనున్నాయనే చర్చ నడుస్తోంది. ఇదే సమయంలో పాలనలో పనితీరు, ప్రాంతీయ సమీకరణాలు, సామాజిక వర్గాల ప్రాతినిధ్యం, పార్టీ అవసరాలు కూడా మంత్రివర్గ విస్తరణలో కీలకపాత్ర పోషించనున్నాయి.

### గెలుపు బాధ్యతలు.. నేతలకు కొత్త సవాళ్లు!

అధికార కూటమికి ఈ ఎన్నికలు పాలనపై ప్రజల అభిప్రాయాన్ని పరోక్షంగా తెలుసుకునే అవకాశాన్ని కల్పించనున్నాయి. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు, స్థానిక సమస్యల పరిష్కారం, కూటమి పార్టీల మధ్య సమన్వయం ఓటర్లపై ఎలాంటి ప్రభావం చూపాయన్నది ఫలితాల్లో కొంతవరకు ప్రతిఫలించవచ్చు. అయితే రాష్ట్రస్థాయి రాజకీయ అంశాలతోపాటు తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, డ్రైనేజీ, వీధి దీపాలు వంటి స్థానిక సమస్యలే గ్రామీణ, పట్టణ ఓటర్ల నిర్ణయాలను ప్రభావితం చేసే అవకాశమూ ఉంది.

టీడీపీలో జిల్లా ఇన్‌చార్జి మంత్రులు, ఎమ్మెల్యేలపై స్థానిక ఎన్నికల బాధ్యతలు పెరగవచ్చన్న ప్రచారం ఆసక్తిని రేకెత్తిస్తోంది. జిల్లాలో పార్టీకి ఎన్ని స్థానాలు దక్కాయి? మిత్రపక్షాలతో సీట్ల సర్దుబాటు ఎలా జరిగింది? రెబల్ అభ్యర్థులను ఎంతవరకు నియంత్రించగలిగారు? వంటి అంశాలు ఆయా నాయకుల పనితీరును అంచనా వేయడానికి ప్రాతిపదిక కావచ్చని పార్టీ వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం. మంత్రి 11లో

# పార్టీల పాపం.. ప్రజలకి శాపం!

(మొదటిపేజీ తరువాయి)

అమాయకులైన కార్యకర్తలు నడిరోడ్డుపై తలలు పగలగొట్టుకుంటూ ఒకరి ఆస్తులు ఒకరు తగలబెట్టుకుంటుంటే బడా నాయకులు మాత్రం ఆ మంటల మాటున రాజకీయ చలి కాసుకుంటూ పబ్బం గడుపుకుంటున్నారు. ఫలితంగా పచ్చని గ్రామాల్లో నెత్తుటేర్లు పారుతున్నాయి. ప్రశాంతంగా ఉండే పట్టణాల్లో భీకర దాడులు జరుగుతున్నాయి. నగరాల్లో సైతం విధ్వంసాలతో జనాల హాహాకారాలు మారుమోగుతున్నాయి.

పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు దేశ ప్రజాస్వామ్యానికి చిహ్నాలైతే. మున్సిపల్, కార్పొరేషన్, పంచాయతీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజల స్వయంపాలన, స్వపరిపాలనకు నిలువుటద్దంగా నిలుస్తాయి. అలాగే వారిలో రాజకీయ చైతన్యానికి పునాదులు వేస్తాయి. ఈ కారణంగానే దేశంలో పంచాయతీరాజ్ చట్టాన్ని కేంద్రం తీసుకొచ్చింది. అయితే ఈ చట్టం తీసుకొచ్చిన ఉద్దేశం సరైనదే అయినా , వివిధ రాజకీయ పార్టీలు నాయకులూ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వచనాన్ని ఇష్టారాజ్యంగా మార్పులు చేసి పల్లె ప్రజల్లో ఈర్ష్యాద్వేషాలను రగిలిస్తూ వారిని రాజకీయ పార్టీలకు పావులుగా మార్చేస్తున్నారు. ఫలితంగా అప్పటి వరకు ఒకరిముఖం ఒకరు చూసుకుంటూ, ఒకొకరికొకరు తోడుగా నిలిచే జనం పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు వస్తున్నాయంటే ప్రత్యర్థులుగా మారి ఎదుటివారి రక్తం కళ్లజూస్తున్నారు. ఒకరిపై ఒకరు నిర్ధాక్షిణ్యంగా దాడులకు తెగబడుతూ గ్రామాలను రణరంగంగా మార్చేస్తున్నారు. ఫలితంగా ఎన్నికల ప్రకటన నాటి నుంచే గ్రామాలు, పట్టణాలు, నగరాలు యుద్ధభూమిగా మారుతున్నాయి.

## వీధిపోరాటాలను తలపిస్తున్న స్థానిక సమరం!

తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సమరం మూడు దశల్లో నిర్వహించాలని నిర్ణయించారు. మొదట మున్సిపాలిటీలకు, ఆ తర్వాత మండల పరిషత్, జిల్లా పరిషత్, చివర్లో సర్పంచ్ ఎన్నికలు జరపాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో మొదట మున్సిపాలటీలకు వార్డుల రిజర్వేషన్లను నిర్ణయించి నామినేషన్ల స్వీకరణ ప్రారంభించారు. అయితే అటు అధికార కూటమి పార్టీలు, ఇటు ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ మందబలంతో ముందుకెళ్తూ ఎన్నికల ప్రక్రియను హింసాత్మకంగా మార్చేస్తున్నాయి. తాజాగా తెలుగుదేశం, జనసేన, బీజేపీ, వైఎస్సార్ సీపీ నాయకుల గొడవలతో ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు సైతం నామినేషన్ దాఖలు చేసే పరిస్థితి కనిపించడం లేదు. తమ కళ్లెదుటే నామినేషన్ పత్రాలను ప్రత్యర్థుల చేతిలో నుంచి లాక్కెళ్లడం, చింపివేయడం, కాల్చివేయడం చేస్తున్నా పోలీసులు కిమ్మనడం లేదు. పోలీసుశాఖ కీలుబొమ్మగా మారడంతో ధనబలం, అధికార బలం, మందబలం ఉన్న నాయకులు ఆంబోతుల్లా రెచ్చిపోతూ ప్రత్యర్థులపై దాడులకు తెగబడుతున్నారు. ఫలితంగా నామినేషన్లు ఎవరు వేస్తున్నారో..? ఎంతమంది వేస్తున్నారో కూడా తెలియకుండా పోతోంది. తమ పార్టీ అభ్యర్థులను నామినేషన్లు వేయనీయకుండా అడ్డంకులు సృష్టిస్తూ కూటమి పార్టీలైన తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ నాయకులు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నాయని వైఎస్సార్ సీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. అయితే గత ఐదేళ్ల ముందు జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అప్పటి అధికార వైఎస్సార్‌సీపీ నాయకులు చేసిన దాష్టీకాలు, దౌర్జన్యాలు, అకృత్యాలకు ఇది దేవుడిచ్చిన రిటర్న్ గిఫ్ట్ అని కూటమి నాయకులు వాదిస్తున్నారు. గతంలో వైఎస్సార్ సీపీ నాయకులు చేసిన కర్మకు నేడు ప్రతిఫలం అనుభవిస్తున్నారంటూ ఎద్దేవా చేస్తున్నారు. అయితే గతంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేస్తూ బలవంతంగా పలు పంచాయతీలు, మున్సిపాలిటీలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలను ఏకగ్రీవం చేస్తున్న విషయం అందరికీ తెలిసిందే. అందుకే కీలెరిగి వాతపెట్టాలన్నట్లుగా ప్రజలు అదును చూసి అసెంబ్లీ ఎన్నికల్లో 151 నుంచి 11సీట్లకు పరిమితం చేసి వైఎస్సార్‌సీపీని గద్దెదించారు. అయితే ఈ విషయాన్ని గుర్తెరగకుండా కూటమి నాయకులు సైతం అదేబాటలో ప్రయాణిస్తూ ఎన్నికలను స్వలాభం కోసం వాడుకుంటూ ప్రభుత్వ యంత్రాంగాన్ని, అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. ఈ క్రమంలో కర్మ సిద్ధాంతాన్ని వల్లెవేస్తున్న కూటమి నాయకులు తెలిసి తప్పులు చేస్తే భవిష్యత్‌లో కర్మఫలం తమకూ తప్పదన్న వాస్తవాన్ని గుర్తించలేకపోతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

## రాయలసీమలోనే ఇంత హింస ఎందుకు..?

కాగా ప్రస్తుతం జరుగుతున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర కంటే రాయలసీమలోనే హింస అధికంగా జరుగుతోంది. దీనికి ముఖ్యంగా వైఎస్సార్‌సీపీలో బలమైన నాయకులుగా చెప్పుకునే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గతంలో పుంగనూరులో అన్ని వార్డులనూ బలవంతంగా గెలుచుకుని దారుణాలకు పాల్పడ్డారు. ఇప్పుడు అక్కడ తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి నాయకులు అదే ధోరణితో ముందుకు సాగుతూ ప్రతిపక్ష పార్టీకి చెందిన అభ్యర్థులను అసలు నామినేషన్లే వేయకుండా అడ్డుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక రాయచోటిలో శ్రీకాంత్‌రెడ్డి వర్సెస్ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అన్నట్లుగా పరిస్థితులు మారి మున్సిపల్ నామినేషన్ల పర్వం రణరంగాన్ని తలపించింది. అలాగే పులివెందులలో అవినాష్‌రెడ్డి వర్సెస్ బీటెక్ రవి వర్గం మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా పరిస్థితి దిగజారి వైఎస్సార్‌సీపీ నాయకుల నామినేషన్లే దాఖలు కాలేదు. ఇక ఐదేళ్ల క్రితం భూమన కరుణాకరరెడ్డి ప్రాతినిధ్యం వహించిన తిరుపతి మున్సిపల్ ఎన్నికల్లో దొంగఓట్ల దందా తారాస్థాయిని తాకిందనే ఆరోపణలున్నాయి. దాని ఫలితమే తాజాగా ఇప్పుడు తిరుపతిలో స్థానిక ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు కార్పొరేటర్లుగా నామినేషన్లు దాఖలు చేసేందుకు వెళ్లినా వారికి రిక్తహస్తాలే మిగులుతున్నాయి. అలాగే పులివెందుల, జమ్మలముడుగు, ప్రొద్దుటూరు, మైదకూరు వంటి చోట్ల కూడా హింస, విధ్వంసాలు పతాక స్థాయికి చేరుకున్నాయి. గతంలో అధికారంలో ఉన్న నాయకులు చేసిన తప్పిదాలను ఎత్తిచూపుతూ ప్రస్తుతం ప్రభుత్వంలో ఉన్న పార్టీలు సైతం అదే మార్గంలో సాగుతుండడం రాయలసీమలో దిగజారుతున్న నైతిక, రాజకీయ పరిస్థితులను కళ్లకు కడుతోంది.

## ప్రజల ఖర్మ ఎవరికీ పట్టదా..?

ప్రతిపక్షంలో ఉన్న సమయంలో రాజకీయ పార్టీలకు ప్రజాస్వామ్యం గుర్తుకురావడం, అధికారంలో ఉన్నప్పుడు మందబలం ప్రదర్శించడం పారిపాటిగా మారిందంటే అతిశయోక్తి కాదు. భారత ప్రజాస్వామ్యంలో విలువలకు తిలోకాలివ్వడం, నిబంధనలను అతిక్రమించడం దశాబ్దాల ముందే ప్రారంభమైంది. అయితే రాజకీయాలు వ్యక్తిగత కక్షలకు నిలయంగా మారడం, ముఠాతగాదాలకు తావివ్వడం, నచ్చని నాయకులపై కక్ష సాధింపు ధోరణి ప్రదర్శిస్తూ జైలుపాలు చేయడం వర్తమాన రాజకీయాల్లో రివాజుగా మారింది. ఈ పరిస్థితి రోజురోజుకూ దిగజారి రాజకీయాలు హత్యలు, దోపిడీలు, విధ్వంసాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నాయి. ఫలితంగా ప్రజాస్వామ్యంలో గెలుపోటములను నాయకులు హుందాగా స్వీకరించలేకపోతున్నారు. ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి ఫలాలను అందించి వారి మనసులను గెలుచుకుని తద్వారా పదవులు పొందాలనే ఆలోచలను దాటి ప్రజలను భయపెట్టి ఓట్లు దండుకునేందుకు కుళ్లు, కుతంత్రాల సాయంతో అడ్డదారిలో విజయం సాధించేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. ఫలితంగా ప్రజల యొక్క, ప్రజల చేత, ప్రజల కొరకు ప్రజలే ఎన్నుకొనే ప్రభుత్వ విధానమే ప్రజాస్వామ్యం అన్న అబ్రహాం లింకన్ నిర్వచనాన్ని నేటి రాజకీయ నాయకులు తుంగలో తొక్కేస్తున్నారు. ఫలితంగా ప్రజలను భయపెట్టి, బాధపెట్టి, బానిసలుగా చూసే విధానమే ప్రజాస్వామ్యం అనేలా తప్పులపై తప్పులు తామరతంపరగా చేస్తూ యథేచ్ఛగా ప్రజాస్వామ్యాన్ని పట్టపగలే రాజకీయ హత్య చేస్తున్నారు.

ముఖ్యంగా అధికారంలో ఏ పార్టీ ఉన్నా ఆ పార్టీ నాయకుల అడుగులకు మడుగులొత్తుతూ పోలీసు వ్యవస్థ, అధికార యంత్రాంగం నిస్తేజంగా, జీవచ్ఛవాల్లా మారడం మాత్రం ప్రజాస్వామ్యానికి పట్టిన గ్రహణంగానే భావించాల్సి ఉంటుంది. ఈ పరిస్థితి మరింత దిగజారితే మనది పేరుకు ప్రజాస్వామ్యమైనా, నియంత పాలనకు తక్కువ కాదు అన్నట్లుగా పరిస్థితులు దిగజారవచ్చు. ఏదేమైనా వారు చేశారంటూ వీరు, వీరు చేస్తున్నారుగా మేమొస్తే రప్పారప్పా సప్తముద్రాల అవతల ఉన్నా వదలం అంటూ ప్రతిపక్ష నాయకులు హెచ్చరికలుచేస్తూ నైతిక, రాజకీయ విలువలకు తిలోదకాలివ్వడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టే. ఒక్కటి మాత్రం నిజం అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు ఖర్మ, రిటర్న్‌గిఫ్ట్‌లు అంటూ నామినేషన్ల నుంచి ప్రచారం, పోలింగ్ వరకు ఎన్నికల నిబంధలను కాలరాస్తుండడం మాత్రం రాష్ట్ర ప్రజల ఖర్మే అనుకోవాలి. ఇదే కారణంగా ఎన్నిపార్టీలొచ్చినా ఎందరు నాయకులొచ్చినా ఆంధ్రాలో స్థాని 'కథ' మారడం లేదు. పార్టీల పాపం... ప్రజలకి శాపంగా మారుతోందనడంలో సందేహం లేదు. ఈ వాస్తవాన్ని ఆయా రాజకీయ పార్టీలు వాటి నాయకులు వాళ్ళ మధ్య గొర్రెల్లా నలిగిపోతూ, అమాయకంగా బలైపోతున్న ప్రజలు ఎంత తొందరగా గ్రహిస్తే రాష్ట్రానికి అంత మంచిది!

# పురపోరుకు తాత్కాలిక బ్రేక్!

## సుప్రీం నిర్ణయంతో.. ఖంగుతిన్న అధికార కూటమి

## నవంబర్ 1న మున్సిపల్ ఎన్నికలు జరిగే అవకాశం

రాష్ట్రంలో మునిసిపల్ ఎన్నికల ప్రక్రియ అనూహ్య మలుపు తిరిగింది. 19 స్థానాల్లో జరిగిన ఏకగ్రీవాలపై సుప్రీంకోర్టు స్టే విధించడంతో రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ చర్చకు తెరలేచింది. ఏకగ్రీవాల ప్రక్రియలో నిబంధనలు పాటించలేదన్న ఆరోపణలు, ప్రతిపక్షాల అభ్యంతరాల నేపథ్యంలో దాఖలైన పిటిషన్లను పరిశీలించిన ధర్మాసనం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ పరిణామం వైఎస్సార్‌సీపీకి రాజకీయంగా ఊరటనిచ్చిందన్న అభిప్రాయం వ్యక్తమవుతుండగా, ఎన్నికల ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని భావించిన అధికార కూటమికి మాత్రం అనూహ్య ఎదురుదెబ్బగా విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

### 19 ఏకగ్రీవాలపై స్టే

ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించిన 19 స్థానాల ఫలితాలను సుప్రీంకోర్టు తాత్కాలికంగా నిలిపివేసింది. ఆయా స్థానాల్లో మళ్లీ నామినేషన్లు స్వీకరించాలని ఆదేశించింది. నామినేషన్ల దాఖలు, పరిశీలన, ఉపసంహరణ తదితర ప్రక్రియలను నిబంధనల ప్రకారం నిర్వహించాలని స్పష్టం చేసింది. పోటీకి అవకాశం లేకుండా ఏకగ్రీవాలు జరిగినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో కోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 25వ తేదీ వరకు పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించవద్దని కూడా సుప్రీంకోర్టు ఆదేశించింది. దీంతో ఎన్నికల ప్రక్రియలో తదుపరి దశలపై తాత్కాలికంగా అనిశ్చితి నెలకొంది. ఏకగ్రీవంగా ఎన్నికైన స్థానాల్లో తిరిగి పోటీకి అవకాశం కల్పించడంతో రాజకీయ సమీకరణాలు మారే అవకాశం ఉంది. ఇప్పటివరకు పోటీకి దూరంగా ఉన్న అభ్యర్థులు, పార్టీలు మళ్లీ రంగంలోకి దిగే పరిస్థితి ఏర్పడింది.

### 100 మునిసిపాలిటీల్లో ప్రక్రియ నిలిపివేత!

సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ముందుగా ప్రకటించిన 100 మునిసిపాలిటీల ఎన్నికల ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేస్తూ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. నామినేషన్ల ప్రక్రియ నుంచి తుదిజాబితా ప్రకటన వరకు చేపట్టాల్సిన చర్యలపై స్పష్టత వచ్చేవరకు ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లకూడదని నిర్ణయించింది. దీంతో ఇప్పటికే ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు, అభ్యర్థులు, రాజకీయ పార్టీలకు తాత్కాలికంగా విరామం ఏర్పడింది. ఎన్నికల నిర్వహణకు సంబంధించి స్థానిక స్థాయిలో చేపట్టిన ఏర్పాట్లు కూడా నిలిచిపోయాయి. తదుపరి షెడ్యూల్, నామినేషన్ల స్వీకరణ తేదీలు, ప్రచార కార్యక్రమాలపై రాష్ట్ర ఎన్నికల సంఘం కొత్తగా మార్గదర్శకాలు జారీ చేయాల్సి ఉంది.

### రాజకీయ పార్టీల్లో ఉత్కంఠ

సుప్రీంకోర్టు తీర్పు వైఎస్సార్‌సీపీకి సానుకూలంగా ఉందంటూ ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఏకగ్రీవాల పేరుతో తమ అభ్యర్థులను పోటీ నుంచి తప్పించారని, స్థానికంగా ఒత్తిళ్లు తీసుకొచ్చారని ఆ పార్టీ నేతలు గతంలో ఆరోపించారు. ఇప్పుడు మళ్లీ నామినేషన్లకు అవకాశం లభించడంతో తమ అభ్యర్థులకు పోటీ చేసే అవకాశం దక్కిందని వారు చెప్తున్నారు. మరోవైపు, ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు సిద్ధమైన అధికార కూటమికి ఈ పరిణామం ఇబ్బందికరంగా మారింది. ఇప్పటికే స్థానిక స్థాయిలో అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలు, సమన్వయ కార్యక్రమాలు చేపట్టిన పార్టీలకు తాజా ఆదేశాలు కొత్త సవాళ్లు విసిరాయి. ఏకగ్రీవంగా ముగిసిన స్థానాల్లో మళ్లీ పోటీ ఏర్పడితే ఫలితాలు ఎలా ఉంటాయన్న దానిపై కూటమి నేతలు సమీక్షించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అభ్యర్థులకు సమాన అవకాశాలు కల్పించడం, నామినేషన్ల స్వీకరణలో ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడడం, పోటీ నుంచి తప్పుకునేలా ఒత్తిళ్లు లేకుండా చర్యలు తీసుకోవడం వంటి అంశాలు ఇప్పుడు కీలకంగా మారాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంటుంది. తిరిగి నామినేషన్ల స్వీకరణ సమయంలో భద్రతా ఏర్పాట్లు, అధికారుల పర్యవేక్షణ, అభ్యర్థుల ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలు ప్రాధాన్యం సంతరించుకోనున్నాయి. గతంలో చోటుచేసుకున్న పరిణామాలు పునరావృతం కాకుండా ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

### తదుపరి చర్యలపై సర్వత్రా ఆసక్తి!

ప్రస్తుతం 100 మునిసిపాలిటీల ఎన్నికల ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయినప్పటికీ, ఇది పూర్తిస్థాయి రద్దు కాదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేసిన అనంతరం తదుపరి షెడ్యూల్‌పై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. 25వ తేదీ తర్వాత పరిస్థితిని సమీక్షించి, నామినేషన్ల ప్రక్రియను ఎలా కొనసాగించాలన్న దానిపై రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వనున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. మొత్తంగా, 19 ఏకగ్రీవాల వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా 100 మునిసిపాలిటీల ఎన్నికలపై ప్రభావం చూపింది. సుప్రీంకోర్టు జోక్యంతో పురపోరుకు తాత్కాలికంగా బ్రేక్ పడగా, రాజకీయ పార్టీల వ్యూహాలు కూడా మారాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏకగ్రీవ స్థానాల్లో మళ్లీ పోటీ జరిగితే స్థానిక రాజకీయ సమీకరణలు మారే అవకాశం ఉంది. ఇప్పుడు అందరి దృష్టి రాష్ట్ర ఎన్నికల సంఘం తదుపరి ఉత్తర్వుల పైనే ఉంది. ఈ పరిణామంతో వైస్సార్ కాంగ్రెస్ పార్టీ పండుగ చేసుకుంటుంటే, కూటమి శ్రేణుల్లో మాత్రం నిరుత్సాహం నెలకొంది.

### నవంబర్ 1న పోలింగ్.. 3న ఫలితాలు?

తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఏపీలో ఈ నెల 28న జరగాల్సిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌ని రాష్ట్ర ఎన్నికల సంఘం నవంబర్ 1వ తేదీకి వాయిదా వేసినట్లు తెలుస్తోంది. నవంబర్ 3న ఫలితాలు ప్రకటించే అవకాశం ఉందని, ఈ నెల 25న అభ్యర్థుల తుది జాబితా వెలువడవచ్చని భావిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

### డిప్యూటీ మేయర్‌గా పాలనా అనుభవం
### కార్పొరేషన్ రాజకీయాల పట్ల అవగాహన
### అధికార కూటమి బలమే తన గెలుపుకి ధీమాగా
# రూప్‌కుమార్‌యాదవ్

తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి అభ్యర్థిగా పోలుబోయిన రూప్‌కుమార్ యాదవ్ బరిలో నిలవడంతో నెల్లూరు నగర రాజకీయాల్లో కొత్త సమీకరణలు తెరపైకి వచ్చాయి. గతంలో డిప్యూటీ మేయర్‌గా పనిచేసిన అనుభవం, స్థానిక రాజకీయాలపై అవగాహన, కూటమిలోని కీలక నాయకుల మద్దతు ఆయనకున్న అనుకూల అవకాశాలుగా కనిపిస్తున్నాయి. అయితే ఈ అవకాశాలని ఎన్నికల విజయంగా మలచుకోవడమే ఇప్పుడు ఆయన ముందున్న టార్గెట్.

"రూప్‌కుమార్‌యాదవ్"... నెల్లూరు నగర రాజకీయాల్లో బాగా పరిచయం ఉన్న పేరు ఇది. గతంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీతో కలిసి పనిచేసిన ఆయన, అనంతరం కొన్ని రాజకీయ విభేదాల నేపథ్యంలో వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి దంపతులతో పాటు తాను కూడా తెలుగుదేశం పార్టీలో చేరారు. 2024 ఎన్నికల సమయంలో టీడీపీకి మద్దతుగా పని చేశారు. ఈ పరిణామాలు ఆయన రాజకీయ ప్రయాణంలో కీలక మలుపులుగా నిలిచాయి. నగర పాలక సంస్థలో డిప్యూటీ మేయర్‌గా పనిచేసిన అనుభవం కారణంగా ఆయనకు పరిపాలనా వ్యవస్థపై పట్టుంది. కార్పొరేటర్లతో సమన్వయం చేసుకోగలిగిన సమర్ధత వుంది. స్థానిక సమస్యల పరిష్కారం వంటి విషయాలపై అవగాహన కూడా కావలసినంత వుంది. ఇవన్నీ మేయర్ అభ్యర్థిగా ఆయనకి కలిసొచ్చే అంశాలు.

### కూటమి నాయకుల మద్దతు ప్రధాన బలం!

రూప్‌కుమార్‌యాదవ్ అభ్యర్థిత్వానికి కూటమిలోని ముఖ్య నేతల మద్దతు లభించడం కూడా ఆయనకు కలిసొచ్చిన అదృష్టం. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు తదితర నాయకుల సహకారం ఆయన ప్రచారానికి రాజకీయ ప్రాధాన్యతని పెంచుతుంది. నగరంలోని వివిధ ప్రాంతాల్లో వున్న కూటమి శ్రేణులను సమన్వయం చేయడం, కార్పొరేటర్ అభ్యర్థుల మధ్య సహకారాన్ని పెంపొందించడం, పార్టీ యంత్రాంగాన్ని సమర్ధవంతంగా వినియోగించడం వంటి అంశాల్లో ఈ నాయకత్వ మద్దతు కీలకంగా మారుతుందనడంలో సందేహం లేదు. అయితే నాయకుల మద్దతు మాత్రమే విజయాన్ని నిర్ణయించదు. స్థానిక స్థాయిలో కార్యకర్తల చురుకుదనం, ఓటర్లతో ప్రత్యక్ష సంబంధాలు, అభ్యర్థుల మధ్య సమన్వయం కూడా అంతే ముఖ్యం.

### ప్రత్యర్థి నుంచి గట్టి పోటీ

మేయర్ పదవి కోసం వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ తరఫున ఆనం విజయకుమార్‌రెడ్డి బరిలో ఉండటం పోటీని ఆసక్తికరంగా మార్చిందనే చెప్పొచ్చు. స్థానిక పరిచయాలు, పార్టీ కార్యకర్తల మద్దతు, నగరంలోని రాజకీయ సమీకరణలను తమకు అనుకూలంగా మలచుకునేందుకు ఇరు పక్షాలు ప్రయత్నిస్తున్నాయి. రూప్‌కుమార్‌యాదవ్ గతంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీతో పనిచేసిన అనుభవం ఆయనకు స్థానిక రాజకీయాలపై అప్రమత్తతో వ్యవహరించడానికి ఉపకరించవచ్చు. మరోవైపు, రాజకీయంగా పార్టీ మారిన నేపథ్యంలో పాత పరిచయాలను రూప్‌కుమార్ ఎంతవరకు కొనసాగించ గలిగారు, కొత్త పార్టీల శ్రేణులతో ఎంత సమర్థంగా సమన్వయం సాధించారు అన్న అంశాలు కూడా ముఖ్యమే. ఈ అంశాలపై ఓటర్ల స్పందన ఎలా ఉంటుందన్నది ఎన్నికల ప్రక్రియలో కీలకంగా మారవచ్చు. మొత్తంగా చూస్తే, రూప్‌కుమార్‌యాదవ్‌కు మేయర్ పదవిపై ఆశలు పెంచే రాజకీయ బలాలు ఉన్నాయి. అయితే ఆ బలాలను ప్రజల విశ్వాసంగా, ఎన్నికల విజయంగా మార్చుకోవడం ఆయన రాజకీయ సామర్థ్యానికి అసలైన పరీక్ష. నెల్లూరు నగరాభివృద్ధికి స్పష్టమైన దిశానిర్దేశం, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వం, కూటమి శ్రేణుల ఐక్యత ఆయన విజయ ప్రయాణంలో కీలకపాత్ర పోషించనున్నాయి. కేవలం పార్టీ పెద్దల ఆశీస్సులే కాకుండా క్షేత్రస్థాయిలో జనాన్ని ఆకట్టుకోగలిగిన నైజం, ఎంతటి స్థాయి వారితోనైనా వారిలో ఒకడిగా కలిసిపోగలిగే వ్యక్తిత్వం, ఇంట్లో మనిషిగా మారిపోగల కలుపుగోలుతనం ఇవన్నీ రూప్‌కుమార్‌లో వున్న అదనపు లక్షణాలు. ఆయన గెలుపుకి బాటలు వేయగలిగిన ఆకర్షణలు!




నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ పీఠం కోసం రాజకీయ పోరు ఆసక్తికరంగా మారింది. అధికార కూటమి అభ్యర్థిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన రూప్‌కుమార్‌యాదవ్, ప్రతిపక్ష వైసీపీ అభ్యర్థిగా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఆనం విజయకుమార్‌రెడ్డి నువ్వా-నేనా అన్న తరహాలో పోటీపడుతున్నారు.

డిప్యూటీ మేయర్‌గా కార్పొరేషన్‌పై పూర్తి అవగాహన, క్షేత్రస్థాయిలో ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలున్నాయన్న ధైర్యం, కూటమి అగ్రనాయకుల అండదండలు తనకున్నాయన్న భరోసాతో రూప్‌కుమార్ సమరానికి సై అంటుంటే... ఆనం చరిష్మా, సుదీర్ఘ రాజకీయ అనుభవం, నగరంలో వున్న బంధుమిత్రులు, రెడ్డి సామాజిక వర్గం మద్దత్తు తనకున్నాయన్న ధీమాతో ఆనం విజయకుమార్‌రెడ్డి యుద్ధానికి రెడీ అంటున్నారు.

### రాజకీయ కుటుంబ నేపథ్యం, స్థానిక పరిచయాలు
### అధికార పార్టీపై ఉన్న వ్యతిరేకతలే
### తన విజయానికి సోపానాలుగా పోరాడుతున్న
# ఆనం విజయకుమార్‌రెడ్డి

ఎట్టి పరిస్థితులలో నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ పీఠాన్ని దక్కించుకోవాలనే లక్ష్యంతో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఆనం విజయకుమార్‌రెడ్డిని రంగంలోకి దించింది. జిల్లాలో సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన ఆనం కుటుంబానికి చెందిన ఆయనకు మేయర్ అభ్యర్థిత్వం దక్కడం స్థానిక రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. రాజకీయ కుటుంబ నేపథ్యం, పార్టీతో దీర్ఘకాల అనుబంధం, నెల్లూరురూరల్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జిగా నిర్వహిస్తున్న బాధ్యతలు ఆయనకు ఉన్న ప్రధాన అనుకూల అంశాలు. అదే సమయంలో మారిన రాజకీయ పరిస్థితులు, అధికార కూటమి నుంచి ఎదురయ్యే పోటీ, నగరంలోని వివిధ ప్రాంతాల్లో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకోవడం ఆయన ముందున్న సవాళ్ళు.

### ఆనం కుటుంబ రాజకీయ వారసత్వం!

నెల్లూరుజిల్లా రాజకీయాల్లో ఆనం కుటుంబానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ప్రస్తుత రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, దివంగత నాయకుడు ఆనం వివేకానందరెడ్డిలకి విజయకుమార్‌రెడ్డి స్వయానా తమ్ముడు. తన అన్నల ద్వారా తనకి వచ్చిన రాజకీయ అనుభవాన్ని, ఆనం కుటుంబానికి జనంలో వున్న ఆకర్షణని తనకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నాలు విజయకుమార్‌రెడ్డి ఇప్పటికే మొదలు పెట్టారు. జిల్లాలో ఆనం కుటుంబానికి ఉన్న పాత పరిచయాలు, రాజకీయ సంబంధాలు, స్థానిక స్థాయిలో ఉన్న గుర్తింపు ఆయనకు వున్న ప్లస్ పాయింట్లు. అయితే కేవలం కుటుంబ నేపథ్యం, వ్యక్తులతో పరిచయాలు వంటివి మాత్రమే ఎన్నికల్లో విజయాన్ని చేకూర్చలేవు. ఆ పరిచయాలను ప్రస్తుత రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా వినియోగించుకోవడం, ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలను బలోపేతం చేసుకోవడం, వార్డుల వారీగా పార్టీ యంత్రాంగాన్ని సమన్వయపరచడం చాలా కీలకం.

### కాంగ్రెస్ నుంచి వైసీపీ వరకు రాజకీయ ప్రస్థానం!

ఆనం విజయకుమార్‌రెడ్డి తొలుత కాంగ్రెస్‌పార్టీలో రాజకీయ కార్యకలాపాలు నిర్వహించారు. అనంతరం 2016లో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరారు. 2017లో స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. ఆ ఎన్నిక ఆయన రాజకీయ ప్రస్థానంలో ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలిచింది. తరువాత పార్టీ కార్యక్రమాల్లో కొనసాగిన ఆయనకి 2024లో నెల్లూరురూరల్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ బాధ్యతతో నగర పరిసర ప్రాంతాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకునే అవకాశం ఆయనకు లభించింది. ఇప్పుడు మేయర్ అభ్యర్థిగా ఎంపిక కావడం ఆయన రాజకీయ ప్రస్థానంలో మరో కీలకమలుపు. మరోవైపు మొన్నటి దాకా జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌గా విజయకుమార్ రెడ్డి సతీమణి ఆనం అరుణమ్మ కొనసాగడం రాజకీయంగా ఆనంకి అదనపు అర్హత.

### అధికార కూటమి పోటీ ఆనంకి అసలు సవాలు!

మరోవైపు, నెల్లూరు మేయర్ పదవికి అధికార కూటమి తరఫున పోలుబోయిన రూప్‌కుమార్‌యాదవ్ రంగంలో దిగడం ఈ ఎన్నికలలో పోటీకి ప్రాధాన్యం తెచ్చింది. ఓసీ స్థానంలో రెడ్డి సామాజిక అభ్యర్థికి పోటీగా బీసీ అభ్యర్థిని బరిలోదించడం కూటమి సాహసమే. అయితే ఈ ఇద్దరి మధ్య పోటీ వ్యక్తిగత పరిచయాలకు మాత్రమే పరిమితం కాకుండా, పార్టీ బలం, స్థానిక నాయకత్వం, నగర సమస్యలపై వారి వైఖరి వంటి అంశాల చుట్టూ సాగుతుందనడంలో సందేహం లేదు. అంతేకాకుండా రాష్ట్రంలో వైసీపీ ప్రతిపక్షంలో ఉండటం, అధికార కూటమికి ప్రభుత్వ యంత్రాంగంతో పాటు రాజకీయ ఆధిక్యం ఉండటం వంటి అంశాలు ఎన్నికల వాతావరణాన్ని ప్రభావితం చేసే అవకాశాలు ఎక్కువ. నెల్లూరు నగర ప్రజలు అభ్యర్థుల రాజకీయ నేపథ్యంతో పాటు వారి అభివృద్ధి ప్రణాళికలు, ప్రజలకు అందుబాటులో ఉండే తీరు, సమస్యల పరిష్కారంపై చూపే నిబద్ధతను కూడా గమనిస్తారు. ఈ నేపథ్యంలో ఆనం విజయకుమార్ రెడ్డి నగర ప్రజల విశ్వాసాన్ని పొందడం, ఆ విశ్వాసానికి తగిన కార్యాచరణను చూపడం ఆయన ముందున్న పెను సవాలుగా చెప్పొచ్చు.

## కుదిరిన సయోధ్య!
### జనసేన, బీజేపీకి 14 డివిజన్లు ఖరారు



మంత్రి నారాయణ, జనసేన నాయకులతో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు కొలిక్కి వచ్చింది. ఇటీవల నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మంత్రి పొంగూరు నారాయణ, జిల్లా టీడీపీ అధ్యక్షులు బీదా రవిచంద్రలతో కలిసి సీట్ల విషయమై జనసేన నేత, టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ చర్చించారు. నెల్లూరు నగరం, నెల్లూరు రూరల్‌లో జనసేనకు నాలుగు, బీజేపీకి మూడు చొప్పున మొత్తం 14 డివిజన్లు కేటాయించారు. మిగిలిన 58 డివిజన్లలో టీడీపీ అభ్యర్థులు బరిలో నిలుస్తున్నారు. ఆమేరకు సీట్ల సర్దుబాటు పూర్తవడంతో కూటమి అభ్యర్థులు ఎన్నికల సమరానికి సిద్ధమవుతున్నారు. సమన్వయంతో ప్రచారం నిర్వహించి ప్రత్యర్థులకు గట్టి పోటీ ఇవ్వాలని త్రిశూల వ్యూహంతో ముందుకు సాగాలని నిర్ణయించుకున్నారు.

## ఈవీఎం గోడౌన్ల వద్ద భద్రత
### పరిశీలించిన అధికారులు



గోడౌన్ భద్రతలను పరిశీలిస్తున్న అధికారులు

భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు జిల్లా అధికారులు ఈవీఎం గౌడౌన్ల వద్ద పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల రాష్ట్ర డిప్యూటి చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్..రాష్ట్ర ఈవీఎం నోడల్ అధికారి ఎస్. ఆంజనేయులు, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లతో కలసి ఈ గోడౌన్లను పరిశీలించారు. ఈవీఎం గోడౌన్ల వద్ద ఎలాంటి లోటుపాట్లు లేకుండా, నిబంధనల మేరకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని వారు తెలిపారు. డిఆర్ఓ విజయకుమార్, ఆర్డీఓ అనూష పాల్గొన్నారు.

### బీద రవిచంద్రతో...
## బీజేపీ నేతల భేటీ

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో, టీడీపీ జిల్లా అధ్యక్షుడు..ఎమ్మెల్సీ బీద రవిచంద్రతో పలువురు బీజేపీ నాయకులు ఇటీవల సమావేశమై ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలను చర్చించారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు వంశీధర్‌రెడ్డి, ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నేత రఘు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఎన్నికల్లో అందరం కలసికట్టుగా పనిచేసి అన్ని స్థానాల్లోనూ విజయం సాధించాలని, అందుకు తగ్గ ప్రణాళికలను చర్చించుకున్నారు.

లాయర్
అక్టోబరు 23, 2026

# రోగుల ప్రాణాలను తోడేస్తున్న 'మందుల మాఫియా'లు!

ఎక్కడ చూసినా రకరకాల మాఫియాలు నేడు దేశాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. వాటిలో ప్రధానమైనవి మందుల మాఫియాలు. రోగులను కాపాడాల్సిన మందులే నిట్టనిలువునా వారి ప్రాణాలను తోడేస్తున్నాయి. అసలివి ప్రాణరక్షణ మందులా?.. లేక ప్రాణభక్షణ మందులా అని సామాన్యులు బెంబేలెత్తిపోయే దుస్థితి కూడా దాపురించింది. మొత్తంగా మందుల రంగానికే మాయనిమచ్చ తెచ్చేలా కొంతమంది అక్రమ వ్యాపారులు మందుల మాఫియాలుగా ఏర్పడి ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్నారు. దేశంలో మందుల పరిశ్రమ బాగా విస్తరిస్తున్నదని సంతోషపడుతున్న తరుణంలో, కల్తీ మందుల తయారీ, సరఫరాల వంటివి చాపకింద నీరులా తయారై ప్రజారోగ్యాన్ని కాలరాస్తుండడం దురదృష్టకర పరిణామం. ఇటీవలి కాలంలో ఈ రకం దోపిడీ మరింత మితిమీరింది. అక్రమ వ్యాపారాలతో కోట్లకు పడగలెత్తుతున్న మందుల మాఫియాల ఆట కట్టించడం ఎవరికీ సాధ్యం కాదన్న పరిస్థితి వచ్చేసింది. ఎన్ని కఠినచట్టాలున్నా.. బరితెగించిన అక్రమార్కులు వాటిని లెక్కచేయడం లేదు. ఈ ధోరణి అటు ప్రభుత్వాలకే కాక, నిజాయితీగా ఉండే ఔషధ తయారీ సంస్థలకి కూడా ఒక సవాలుగా పరిణమిస్తోంది. అసలే వ్యాధుల బాధలతో వేదన పడుతున్న రోగులని ఈ పరిణామాలు మరింతగా కుంగదీస్తున్నాయి. అందులోనూ గుండె జబ్బులు, క్యాన్సర్, మధుమేహం, రక్తపోటు వంటి విషమ వ్యాధులతో ఉన్నవారు వేలకువేలు ధరపెట్టి ఆ మందులను కొనలేక నానా బాధలు పడుతున్నారు. మరోవైపు దేశంలో నకిలీ, నాసిరకం మందులు పెరిగిపోతూనే ఉన్నాయి. వాటిని వాడితే ఎంత ప్రమాదమో ఊహించండి. ప్రసిద్ధమైన మందుల కంపెనీల పేర్లతో నకిలీ మందులను రూపొందించడం, గడువు ముగిసిపోయిన మందులను కూడా అమాయకులకు విక్రయించేయడం వంటి అక్రమాలు దేశవ్యాప్తంగా ఎక్కువైపోతున్నాయి. రోజువారీ కూలిపనులు చేసుకుని బతికే కష్టజీవులు, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సామాన్యులు, పేద-మధ్యతరగతి కుటుంబాల వారు, దీర్ఘకాలిక వ్యాధులతో నిత్యం సతమతమవుతున్న సగటు మనుషులకి ఈ మోసాలు తెలియడం లేదు. నకిలీ మందులను గుర్తించేందుకు తగ్గ పరిజ్ఞానం వారికి ఉండడం లేదు. ఆమేరకు అవగాహన కల్పించేవారు కూడా లేరు. సరిగ్గా ఈ బలహీనతలనే ఆసరాగా తీసుకుని మందుల మాఫియాలు విచ్చలవిడిగా రోగులను నిలువు దోపిడీ చేస్తున్నాయి. నకిలీ రసాయనాలు, రకరకాల రంగుపొడులతో కూడా కొందరు మందులు తయారుచేసి మార్కెట్లో అమ్మేస్తున్నారు. అత్యవసరం లేదా డిమాండ్ ఉన్న మందులను, ఇంజెక్షన్లను బ్లాక్‌మార్కెట్‌లో మరింత ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. కొంతమంది తయారీదారులు, మరికొందరు వైద్యులు-ల్యాబ్‌లలో పనిచేసేవారు అందరూ కలిసి ఒక మాయలమారి ముఠాగా ఏర్పడి అక్రమధనార్జన కోసం రోగులకు అవసరం లేని మందులను కూడా ఏదోఒక రకంగా అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన మందులనే, తమ అక్రమ వ్యాపారానికి మార్గాలుగా చేసుకుంటున్నారు. ఒక్క మందులే కాదు, ఆసుపత్రులకు వెళ్లే అనేకరకాల ఆరోగ్యపరీక్షలు, చికిత్సలకంటూ వేలకువేలు గుంజుతూనే ఉన్నారు. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల నివారణకు అత్యవసరమైన మందుల ధరలను కూడా విపరీతంగా పెంచుతుండడం దారుణమంటూ ఇటీవల సుప్రీం కోర్టు కూడా ఆగ్రహం వ్యక్తం చేసింది. మందుల ధరల నియంత్రణకు క్రమబద్ధమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది కూడా.

ఇకనైనా కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కళ్లుతెరిచి, ఇలాంటి మందుల మాఫియాల పట్ల కొరడా ఝుళిపించాలి. అవసరమైతే చట్టాలను మరింత తీవ్రతరం చేసి, నకిలీ మందులతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న అవినీతిపరుల భరతం పట్టాలి. అక్రమ మందుల తయారీదారులు, నాసిరకం మందులను సరఫరాచేసే దుర్మార్గుల ఆట కట్టించాలి. ప్రాణాంతక వ్యాధుల చికిత్సలకు ఉపయోగించే ముఖ్యమైన మందులను నిబంధనలకి విరుద్ధంగా అత్యధికధరలకు విక్రయించే ముఠాలను గుర్తించి కఠినంగా శిక్షించాలి. మందుల ధరలను ఎప్పటికప్పుడు నియంత్రించేందుకు ఆరోగ్యభద్రతా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలి. ప్రజలకు అండగా ఆరోగ్యరక్ష పథకాలను, ఆరోగ్యబీమా వంటివాటిని మరింతగా విస్తరించాలి. ముఖ్యంగా, నాణ్యమైన మందులను ఎలా గుర్తించాలో అవగాహన కలిగించాలి. అదేవిధంగా, ప్రజలు కూడా నకిలీ మందుల మాఫియాల పట్ల అప్రమత్తంగా ఉంటూ.. వాటి బారినపడకుండా ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలి.

# హింసకు ఎవరు పాల్పడినా తప్పే!

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

ఆంధ్రప్రదేశ్‌లో మునిసిపల్ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా కొన్ని చోట్ల చోటు చేసుకున్న హింసాత్మక ఘటనలు అత్యంత విచారకరం. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు స్వేచ్ఛగా, ప్రశాంతంగా జరగాలి తప్ప, ఇలా భయభ్రాంతులకు వేదిక కాకూడదు. రాజకీయ ప్రత్యర్థులను బెదిరించడం, నామినేషన్లను అడ్డుకోవడం, దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. హింసకు ఏ పార్టీకి చెందినవారు పాల్పడినా అది తప్పే. ఒకరి హింసను సమర్థిస్తూ, మరొకరి హింసను ఖండించడం ద్వంద్వ వైఖరి అవుతుంది. తప్పు చేసిన వారు ఎవరైనా వాళ్ళు ఏ పార్టీకి సంబంధించిన వారైనా సరే రాజకీయాలకు అతీతంగా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. రాజకీయాల్లో పోటీ ఉండాలి కానీ కక్షలు ఉండకూడదు. విమర్శలు ఉండాలి కానీ దాడులు జరగకూడదు. అధికారమే పరమావధిగా భావించి శాంతి భద్రతలను విస్మరించడం సమాజానికి మంచిది కాదు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అన్ని రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి.

**జీవీ. సుబ్బయ్య, పిడుగురాళ్ళ.**

# శిథిలావస్థలో రాష్ట్ర రెవెన్యూ కార్యాలయాలు!

రాష్ట్రంలో అనేక ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థలో ఉన్నాయి. నిత్యం వందలాదిమంది ప్రజలు వెళ్తూ కోట్లాది రూపాయల లావాదేవీలు జరిపే రిజిస్ట్రేషన్ కార్యాలయాల పరిస్థితైతే దీనాతిదీనం. ఇక ఇదే కోవలో రెవెన్యూ కార్యాలయాలు కూడా కళావిహీనంగా దర్శనమిస్తున్నాయి. ప్రజలకు, పరిశ్రమలకు అవసరమైన భూముల కేటాయింపు, పేదలకు ఇళ్ల స్థలాల మంజూరు, గృహ నిర్మాణ పథకాల అమలు వంటి కీలక బాధ్యతలను రాష్ట్రంలోని రెవెన్యూ శాఖ నిర్వహిస్తోంది. జనానికి ప్రభుత్వ సేవలను అందించడంలో ముఖ్య భూమిక పోషించే ఈ శాఖ కార్యాలయాలే కనీస వసతులు లేక ఇబ్బందికర పరిస్థితుల్లో కొనసాగుతుండటం బాధాకరం. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో రెవెన్యూ కార్యాలయ భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో ఉద్యోగులు విధులు నిర్వహించడానికి ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు కూడా అవస్థలు ఎదుర్కొంటున్నారు. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండల రెవెన్యూ కార్యాలయ భవన పరిస్థితే ఇందుకు పెద్ద ఉదాహరణ. అక్కడ భవనాల పరిస్థితి, అధ్వాన్నంగా ఆందోళనకరంగా ఉంది. ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్న కూటమి ప్రభుత్వం ఈ సమస్యపై దృష్టిసారించాలి. రాష్ట్రవ్యాప్తంగా శిథిలావస్థలో ఉన్న ఇలాంటి రెవెన్యూ కార్యాలయ భవనాలను గుర్తించాలి. వాటి స్థానంలో ఆధునిక సౌకర్యాలతో కూడిన నూతన భవనాలను నిర్మించడంతోపాటు, అవసరమైన చోట్ల మరమ్మతులు కూడా చేపట్టాలి. ప్రజలకు మెరుగైన సేవలు అందేలా, ఉద్యోగులకు అనుకూలమైన వాతావరణం కల్పించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

**కాళహస్తి సుబ్రహ్మణ్యం, సూళ్లూరుపేట.**

# నిరసనల వెనుక కనిపించని చేతులు?

మనసులో మాట 120

ఓ పక్క పశ్చిమాసియాలోనూ, రష్యా – ఉక్రెయిన్ యుద్ధంతోనూ ప్రపంచంలో ఆందోళనకర పరిస్థితులున్న నేపథ్యంలో మరోపక్క ఐరోపా దేశాల్లో పెల్లుబుకుతున్న ప్రజా నిరసనలు ఆందోళనను మరింత పెంచుతున్నాయి. ఐరోపా పరిణామాల నేపథ్యంలో ఆర్.ఎస్.ఎస్. అధిపతి మోహన్ భగవత్, ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపు భారత దేశ ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని చెప్పాయి. వారి పిలుపులు కొన్ని ప్రశ్నలను లేవనెత్తాయి. మోహన్ భగవత్ తన విజయదశమి ప్రసంగంలో మాట్లాడుతూ ఐరోపా పరిణామాలతోపాటు మన పొరుగుదేశాలైన బంగ్లాదేశ్, నేపాల్ పరిణామాలను ప్రస్తావించారు. మన పొరుగుదేశాల్లో ప్రభుత్వాలను మార్చిన సంగతిని ప్రస్తావిస్తూ ప్రపంచవ్యాప్తంగా కొన్ని శక్తులు దేశాల వ్యవస్థలను బలహీన పరిచేందుకు ప్రయత్నిస్తున్నాయని, ప్రభుత్వాలను మార్చడానికి ప్రయత్నిస్తున్నాయని హెచ్చరించారు. భారత్ కూడా అలాంటి ప్రయత్నాలకు లక్ష్యం కావచ్చని అన్నారు. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ కూడా విజయదశమి సందర్భంగా మాట్లాడుతూ, దేశాన్ని విభజించే శక్తుల కుట్రలను గుర్తించి, వాటిని ఓడించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని పిలుపునిచ్చారు. ఆ శక్తులకు వ్యతిరేకంగా పార్టీలు, ప్రజలందరూ ఐక్యం కావాలన్నారు. దేశం కోసం అందరం కలిసి పని చేయాలన్నారు. భారత్‌లో ఇటీవల కాలంలో జెన్ జీ పేరుతో, కాంగ్రెస్ జనతా పార్టీ నిరసనలు చేపట్టడం, వాటికి కాంగ్రెస్, మరికొన్ని విపక్షాలు మద్దతు తెలుపుతున్న నేపథ్యంలో మోహన్ భగవత్, మోదీల పిలుపు చర్చనీయాంశమయింది.

ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రాథమికమైనది. ప్రభుత్వ విధానాలు నచ్చకపోతే ప్రజలు ప్రశ్నించవచ్చు, తమ హక్కులకు భంగం కలిగితే ఆందోళన చేయవచ్చు. అయితే, నిరసనకు కనిపించే కారణమే దాని అసలు ఉద్దేశమా? లేక ప్రజల అసంతృప్తిని ఉపయోగించుకుని మరొక రాజకీయ లక్ష్యాన్ని సాధించాలనుకునే శక్తులూ దాని వెనుక ఉన్నాయా? అన్నది పరిశీలించాల్సిన ప్రశ్న. ఐరోపాలోని పలు దేశాల్లో నిరసనలు, వాటిపై ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలు, దేశ ప్రజలు ఐక్యంగా ఉండాలని ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు ఈ చర్చకు ప్రాధాన్యం కల్పించాయి. ప్రతి నిరసన వెనుక కుట్ర ఉందని చెప్పడం ఎంత తొందరపాటో, అన్ని ఉద్యమాలూ ప్రకటించిన కారణాలకే పరిమితమని భావించడం కూడా అంతే తొందరపాటు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, గృహాల కొరత, విద్యా వ్యవస్థలో లోపాలు వంటి సమస్యలు ప్రజలను వీధుల్లోకి తీసుకు రావచ్చు. ఫ్రాన్స్‌లో విద్యార్థుల ఆందోళనలు, స్పెయిన్, పోర్చుగల్ వంటి దేశాల్లో గృహాల ధరలు, అద్దెలపై అసంతృప్తి ఇందుకు ఉదాహరణలు. అయితే, ఉద్యమం మొదలైన సమస్యకూ, దాన్ని ఉపయోగించుకోవాలనుకునే ఇతర శక్తుల లక్ష్యాలకూ తేడా ఉండవచ్చు. అందుకే నినాదాలను వినడంతోపాటు, ఉద్యమంలో పాల్గొనే సంస్థలు, ప్రచార వ్యవస్థలు, నిధుల మూలాలు, పరస్పర సంబంధాలను కూడా పరిశీలించాలి. ఉద్యమం సాగేకొద్దీ దాని లక్ష్యాలు మారుతున్నాయా? స్థానిక సమస్య పరిష్కారం కంటే విస్తృత రాజకీయ లక్ష్యాలు ముందుకొస్తున్నాయా? అని అడగడం ప్రజాస్వామ్య వ్యతిరేకం కాదు. ఫ్రాన్స్ నిరసనలకు సంబంధించి అంతర్జాతీయ సంస్థల నెట్‌వర్క్‌లు, వివిధ దేశాల్లోని సంఘాల మధ్య సంబంధాలపై కొన్ని వార్తా కథనాలు వెలువడ్డాయి. ఫాక్స్ న్యూస్ డిజిటల్ కథనం కూడా నిరసనలతో సంబంధం ఉన్నట్లు పేర్కొన్న సంస్థల నెట్‌వర్క్‌ను ప్రస్తావిస్తూ, భారత్‌తో సహా పలు దేశాల్లోని సంస్థలతో సంబంధాలున్నాయని ఆరోపించింది. స్థానిక సమస్యకు అంతర్జాతీయ సంఘీభావం ఉండటం ఒకటి; స్థానిక ప్రజల అసంతృప్తిని బయటి రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం మరొకటి. ఈ రెండింటి మధ్య తేడాను ఆధారాలతో గుర్తించాలి. భగవత్ హెచ్చరికలోని ప్రధాన అంశం దేశాలను బలహీన పరిచే ప్రయత్నాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నది. అంతర్జాతీయ రాజకీయాల్లో ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసే ప్రయత్నాలు, సమాచారాన్ని వ్యూహాత్మకంగా వినియోగించడం వంటి అంశాలను పరిశీలించడం సమంజసమే. దేశాన్ని కాపాడటానికి అప్రమత్తత అవసరం; ప్రజాస్వామ్య హక్కులను కాపాడటానికి విచక్షణ అవసరం. ఈ రెండింటి మధ్య సమతుకమే నిజమైన జాతీయ బాధ్యత.

స్థానిక సమస్యలకు స్థానికంగానే నిరసనలు తెలపాలి, స్థానిక యంత్రాంగంతోనే చర్చలు జరిపి పరిష్కరించుకోవాలి. కానీ ఎప్పుడైతే ఒక స్థానిక నిరసనకు విదేశీ మూలాలున్న గ్రూపుల మద్దతు, 'టూల్‌కిట్' వ్యూహాలు ప్రవేశిస్తాయో, అక్కడే అసలు ప్రమాదం మొదలవుతుంది. స్థానిక సమస్యకు అంతర్జాతీయ మద్దతు పేరిట విదేశీ శక్తులు జోక్యం చేసుకున్నప్పుడు అసలు నిరసనకారుల (ఉదాహరణకు సాధారణ పౌరులు, రైతులు లేదా విద్యార్థులు) ప్రయోజనాలు పక్కకు పోతాయి. అంతర్జాతీయ శక్తుల రాజకీయ అజెండా ముందుకు వచ్చి, దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడం, పెట్టుబడులు రాకుండా చేయడం, దేశ ప్రతిష్ఠను దిగజార్చడం ప్రధాన లక్ష్యంగా మారుతుంది. ఇది అంతిమంగా దేశ సార్వభౌమాధికారానికే సవాలుగా పరిణమిస్తుంది. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును గౌరవిస్తూనే, ఆ నిరసన వెనుక దాగి ఉన్న నిజమైన ఉద్దేశాలను, అరాచక శక్తులను గుర్తించే చైతన్యాన్ని పౌరులు కలిగి ఉండాలి. అంతర్జాతీయ మద్దతు పేరిట జరుగుతున్న ప్రచారాలను, విదేశీ ప్రమేయాలను జాతీయ భద్రతా కోణంలో అర్థం చేసుకుని, పౌరులందరూ విచక్షణతో వ్యవహరించినప్పుడే దేశ సార్వభౌమాధికారం సురక్షితంగా ఉంటుంది.



**- తుమ్మల బాల గంగాధర్ తిలక్**

# జగన్ తీరుతోనే..రాష్ట్రం దివాళా!

గత జగన్ ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలతోనే రాష్ట్రం దివాళా తీసిందని, దీంతో ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చారని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఇటీవల ఆయన నెల్లూరులోని తమ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం వచ్చాక స్థానిక ఎన్నికలు పెట్టకుండా వైసీపీ రెండేళ్లు అప్పట్లో వాయిదా వేసిందని ఆయన గుర్తుచేశారు. ఇప్పటికీ స్థానిక సంస్థల ఎన్నికలు అడ్డుకోవాలని వైసీపీ ప్రయత్నిస్తోందని, ఇంతకంటే దారుణం ఇంకేముంటుందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకి విఘాతం కలిగించాలని కూడా జగన్ ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. పుంగనూరు, రాయచోటి, తిరుపతిలో నామినేషన్ తొలి రోజే వైసీపీ అరాచకాలు చేసిందన్నారు. ఈ ఘటనల్లో మిధున్‌రెడ్డి వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయని, 'కొట్టుకుంటూ, తొక్కుకుంటూ పోవాలి' అని కార్యకర్తలను రెచ్చగొట్టడం మంచి పద్ధతి కాదని అన్నారు. ఎవరైనా సరే, పిచ్చిపిచ్చి చేష్టలు చేస్తే ఊరుకునేది లేదని, ప్రజల్లోకి వెళదాం, అక్కడ తేల్చుకుందాం. రండి'.. అంటూ ఆయన వైసీపీ నేతలకు సవాల్ విసిరారు. నెల్లూరు రూరల్‌లో వైసిపి దౌర్జన్యాలకి పాల్పడితే టీడీపీ కార్యకర్తలు ఎవరూ భయపడవద్దని.. మీకు నేనున్నా నని' ఆయన భరోసా ఇచ్చారు. మళ్ళీ వైసీపీ వచ్చే ప్రసక్తే లేదని, స్వేచ్ఛగా అధికారులు ఎన్నికలు జరపాలని ఆయన సూచించారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి ఎన్నికలను శాంతియుత వాతావరణంలో విజయవంతం చేయాలని చెప్పారు.



ఎమ్మెల్యే కోటంరెడ్డి

### అన్ని స్థానాలూ సాధిస్తాం..

కూటమి ప్రభుత్వం వచ్చాక చరిత్ర ఎరుగని అభివృద్ధి నెల్లూరులో జరుగుతోందని, రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి జరగబోతోందని కూడా ఆయన చెప్పారు. నెల్లూరు కార్పొరేషన్‌లో టీడీపీ కూటమి మేయర్ అభ్యర్థి లక్ష ఓట్ల మెజార్టీతో గెలవబోతున్నారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని 72కి 72 డివిజన్లలో వందశాతం టీడీపీ కార్పొరేటర్లు గెలవబోతున్నారని కూడా ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# టీడీపీ అభ్యర్థులకు బీఫారంలు



రూప్‌కుమార్‌కి బీ ఫారం అందజేస్తున్న మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్సీ బీద తదితరులు

టీడీపీ జిల్లా కార్యాలయంలో నెల్లూరు కార్పొరేషన్ మేయర్ అభ్యర్థి పోలుబోయిన రూప్‌కుమార్‌యాదవ్, బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ అభ్యర్థి దొడ్ల విజయలక్ష్మికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు, శాసనమండలి సభ్యులు బీద రవిచంద్రయాదవ్ ఇటీవల బీ-ఫారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీ మంత్రి తాళ్ళపాక రమేష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తలసేమియా చిన్నారుల కోసం..రక్తదానం



తలసేమియా వ్యాధితో బాధపడుతూ నిరంతరం రక్తమార్పిడి అవసరమయ్యే చిన్నారులకు సహాయపడాలనే సదుద్దేశంతో, బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడ కామాక్షమ్మ దేవస్థానం ఛైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ఈనెల 17న కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం గ్రామంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరాన్ని జానా శ్రీకాంత్, వై.నాగరాజా, వెంకయ్య, వాహిద్‌ల ప్రేరణతో, నెల్లూరు రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో చేపట్టారు. మోటివేటర్ బి.భాస్కర్‌రావు, బ్లడ్ సెంటర్ సాంకేతిక సిబ్బంది పాల్గొని శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారులకు క్రమం తప్పకుండా రక్తం అవసరమవుతుందని, స్వచ్ఛంద రక్తదానం ద్వారా వారి ప్రాణాలను కాపాడవచ్చని, ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంపొందించుకొని, స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేయండి..ప్రాణదాతలుగా నిలవండి అంటూ యువతను కోరారు. రక్తదానం చేసిన రక్తదాతలను అభినందించారు.

# పోలీసు అమరవీరుల సేవలు అజరామరం

• జిల్లాకలెక్టర్, ఎస్పీల నివాళి



ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణతోపాటు శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా విధులు నిర్వహిస్తూ ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు దేశ చరిత్రలో చిరస్మరణీయమని, వారి సేవలు అజరామరమని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, జిల్లా ఎస్పీ డాక్టర్ అజితా వేజెండ్ల చెప్పారు. ఈనెల 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరు పోలీసు పరేడ్ గ్రౌండ్లో నిర్వహించిన కార్యక్రమంలో వారు అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నిర్వహించిన కవాతు, నివాళుల కార్యక్రమం పోలీసుల కర్తవ్యనిష్ఠకు, త్యాగనిరతికి ప్రతీకగా నిలిచింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దేశ రక్షణలో, అంతర్గత భద్రతలో పోలీసులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని తెలిపారు. జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల మాట్లాడుతూ, యూనిఫాం ధరించడం ఒక బాధ్యత అయితే, ప్రజలకు భద్రత కల్పించడం పవిత్రమైన కర్తవ్యమని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన, మహిళలపై అఘాయిత్యాల నివారణ, రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా ఆపరేషన్ త్రిశూల్‌ను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని ఎస్పీ ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన తొమ్మిది మంది పోలీసు సిబ్బంది కుటుంబాలకు కలెక్టర్, ఎస్పీ రూ.50వేల చొప్పున చెక్కులు అందజేశారు. అనంతరం నిర్వహించిన ర్యాలీలో కలెక్టర్, ఎస్పీ పాల్గొన్నారు.

# జడ్పీ ఎన్నికలకు సీపీఎం రెడీ



జడ్పీ ఎన్నికల్లో పోటీకి సిపిఎం సిద్ధమవుతోంది. ఈనెల21న నెల్లూరులోని సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్ తమ పార్టీ అభ్యర్థుల తొలిజాబితాని విడుదల చేశారు. కోవూరు మండలంలోని 1 జడ్పీటీసీ, 22 ఎంపీటీసీ స్థానాల్లో పోటీచేస్తామని తెలిపారు. అదేవిధంగా నెల్లూరు రూరల్ మండలంలోని 6, విడవలూరు మండలంలో 2, ఇందుకూరుపేట మండలంలో 1, దుత్తలూరులో 2, బుచ్చిరెడ్డిపాళెంలో 2, ముత్తుకూరులో 2, ఉదయగిరిలో 1, వెంకటాచలంలో 1, కొడవలూరులో 3, మర్రిపాడు మండలంలో 1 ఎంపీటీసీ స్థానాల్లో తమ పార్టీ అభ్యర్థులు పోటీ చేయనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో సీపీఎం సీనియర్ నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టు ఫోరం..

# జిల్లా మహాసభ 23న

ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరం (ఏపీ జేఏఫ్) శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా శాఖ జిల్లా మహాసభ ఈనెల 23వ తేది ఉదయం 10గంటలకు నెల్లూరు టౌన్‌హాలు (ఏసీ)లో జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సభలో ఆ సంఘం రాష్ట్రస్థాయి నాయకులు, పలువురు మంత్రులు, జిల్లాకి చెందిన ప్రజాప్రతినిధులు, సీనియర్ జర్నలిస్టులు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొంటారని, జిల్లాలోని పాత్రికేయులు పాల్గొని ఈ సభను జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

# జిల్లాలో జడ్పీ ఎన్నికల కోలాహలం

• మొదటిరోజునే 385 నామినేషన్లు



జిల్లాలో జడ్పీ ఎన్నికల కోలాహలం మొదలైంది. నామినేషన్ల ప్రక్రియ బుధవారం (అక్టోబరు 21)నాడు ప్రారంభం కావడంతో ఎంపీటీసీలు, జడ్పీటీసీల నామినేషన్ల హడావిడి జోరందుకుంది. జిల్లాపరిషత్‌కి చెందిన మొత్తం 35 జడ్పీటీసీ స్థానాలకు, 440 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్–జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్ల నేతృత్వంలో, జిల్లా అధికారయంత్రాంగం సమాయత్తమైంది. జడ్పీ ఎన్నికలు నవంబరు 3వ తేదీన జరుగనున్న నేపథ్యంలో, నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. నామినేషన్లు వేసేందుకు వచ్చేవారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. 1959 డిసెంబరు 1వ తేదీ నుంచి జిల్లాపరిషత్తు వ్యవస్థ ఏర్పడినప్పటినుంచి ఇప్పటివరకు జడ్పీకి 8సార్లు ఎన్నికలు జరిగాయి. తాజా ఎన్నికలతో ఇవి 9వ సారి జరిగే ఎన్నికలు కావడం, ఈ ఎన్నికల్లో 32వ ఛైర్మెన్ ఎన్నిక కాబోతుండడం విశేషం.

జడ్పీటీసీ స్థానాలకి సంబంధించి నెల్లూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో నామినేషన్లను స్వీకరిస్తున్నారు. అదేవిధంగా, ఎంపీటీసీ స్థానాలకి సంబంధించిన నామినేషన్లను ఆయా మండలాలలోని ఎంపీడీఓ కార్యాలయాలలో స్వీకరిస్తుండడంతో, అటు మండలాల్లోనూ, ఇటు జిల్లాకేంద్రంలోనూ జడ్పీ ఎన్నికల వేడి రగులుకుంది. ఈనెల 21, 22, 23 తేదీల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తున్నారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియనంతా సీసీ కెమెరాలు, వీడియో కెమెరాల ద్వారా రికార్డు చేస్తున్నారు. గట్టి పోలీసు బందోబస్తు మధ్య నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో ఈనెల21న తొలిరోజునే జడ్పీటీసీ స్థానాలకి 12 నామినేషన్లు వచ్చాయి. వీటిలో టీడీపీ 6, వైసీపీ 4, కాంగ్రెస్ 1, బీఎస్పీ 1 వంతున నామినేషన్లు వేశారు. మండలాలలోని ఎంపీటీసీ స్థానాలకి 373 నామినేషన్లు రాగా, వాటిలో టీడీపీ 178, వైసీపీ174, బీజేపీ 1, కాంగ్రెస్ 3, సీపీఎం 1, జేఎస్పీ1, స్వతంత్రులు 14మంది నామినేషన్లు వేశారు. దీంతో, మొత్తం 385 నామినేషన్లు వేసినట్లయింది. జడ్పీ ఎన్నికల నిర్వహణ కోసం జిల్లా వ్యాప్తంగా 1665 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నట్లు జడ్పీ సీఈఓ మధు సూదన్ తెలిపారు.

# నెల్లూరు కబుర్లు

## విజయమే ధ్యేయం కావాలి

### మంత్రి ఆనం పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నెల్లూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో కీలక సమావేశం నిర్వహించారు. ఆనం నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో నాయకుల మధ్య సమన్వయం, ఎన్నికల సన్నద్ధత, భవిష్యత్ కార్యాచరణపై విస్తృత చర్చ జరిగింది. సంగం, ఏఎస్‌పేట, చేజర్ల మండలాలకు చెందిన తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, ఎన్నికల సన్నద్ధత, కూటమి పార్టీల మధ్య సమన్వయం, అభ్యర్థుల ఎంపికకు సంబంధించిన అంశాలు, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు.

## బై బై!..వైసీపీ!..

### • టీడీపీలోకి..సన్నపురెడ్డి బ్రదర్స్



మంత్రి నారాయణ సమక్షంలో పార్టీలో చేరుతున్న సన్నపురెడ్డి సోదరులు

వైసీపీ నెల్లూరుసిటీ మాజీ అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచల్‌రెడ్డి, ఆయన సోదరుడు సన్నపురెడ్డి వెంకట సుబ్బారెడ్డిలు తమ అనుచరులతో కలిసి టీడీపీలో చేరారు. మంత్రి నారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ 2028 డిసెంబర్ నాటికి నెల్లూరును దేశంలోనే నంబర్ వన్ నగరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. నెల్లూరు కార్పొరేషన్‌లోని 72 డివిజన్లలో కార్పొరేటర్లతోపాటు మేయర్ అభ్యర్థి రూప్‌కుమార్ యాదవ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎన్నికలను అడ్డుకునేందుకు వైసీపీ వివిధ ప్రయత్నాలు చేసిందని ఆరోపించారు. వైసీపీ సృష్టించిన ఆటంకాలను అధిగమించి ఎన్నికలు నిర్వహిస్తున్నామని, ఎన్నికలు జరగకపోతే 16వ ఆర్థిక సంఘం నిధులు వచ్చే అవకాశం ఉండదని పేర్కొన్నారు. నిర్దేశిత గడువులోగా ఎన్నికలు నిర్వహించి తీరాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారని తెలిపారు.

## నేత్రపర్వంగా..సాయిబాబా ఆరాధన



నెల్లూరు బాలాజీనగర్ శివారుల్లోని శ్రీ సాయిదర్బార్ అద్దాల మందిరంలో గత మూడురోజులుగా సాయి బాబా 108వ ఆరాధన మహోత్సవాలు నేత్రపర్వంగా జరిగాయి. మందిరం మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి ఆధ్వర్యంలో తొలి రోజున భిక్షాటన చేశారు. అనంతరం విజయదశమి పర్వదినాలను పురస్కరించుకుని బాబాకి ప్రత్యేక హారతులు, అభిషేకాలు నిర్వహించారు. సాయి సచ్చరిత్రం పూర్తిగ్రంథాన్ని భక్తులు అఖండపారాయణ చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు ఈ వేడుకల్లో పాల్గొని బాబావారిని దర్శించుకుని తరించారు. ప్రముఖ దాత పాటోలు రామసుబ్బయ్య, బాబా భక్తులు బాబీసాయి, సాయిదర్బార్ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.



## భక్త జనసంద్రమైన శ్రీ రాజరాజేశ్వరమ్మ గుడి

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నెల్లూరు దర్గామిట్ట లోని శ్రీ రాజరాజేశ్వరమ్మ దేవాలయం నిత్యం వేలాదిమంది భక్తులతో భక్తసంద్రంగా మారిపోయింది. ఏ ఏటికా ఏడు భక్తజనం వెల్లువలా తరలి వస్తూనే ఉన్నారు. అందుకు తగ్గట్టుగా ఆలయ నిర్వాహకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ కలసి ఈ ఉత్సవాలను జయప్రదం చేశారు. నిత్యం విశేష అలంకారాలతో అమ్మవారు భక్తులకు కన్నులపండువగా దర్శనమిచ్చారు. దుర్గాష్టమి, మహర్నవమి, విజయదశమి రోజుల్లో ఆలయంలో ఇసుకేస్తే రాలనంత జనం వచ్చారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేసి భక్తులకు ఇబ్బందులు లేకుండా చూశారు. దేవాదాయ శాఖ అధికారి కోవూరు జనార్దన్ రెడ్డి, ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీధర్‌నాయుడు, ఛైర్మన్ ఏలూరు శిరీష, ధర్మకర్తల మండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## 30.60 లక్షల రాబడి

రాజరాజేశ్వరమ్మ దేవాలయంలో ఈనెల 21న హుండీలను లెక్కించారు. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఈనెల 6 నుంచి 21వతేదీలోగా 16 రోజుల వ్యవధిలో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా ఆలయానికి 30.60,565 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ మరియు కార్య నిర్వహణాధికారి ఎన్. శ్రీధర్ నాయుడు తెలిపారు. జిల్లా దేవాదాయశాఖ అధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి, నెల్లూరు డివిజన్ దేవాదాయశాఖ ఇన్స్‌పెక్టర్ సిహెచ్ శ్రీనివాసబాబు హుండీ లెక్కింపును పర్యవేక్షించారు.

## దంచికొట్టిన వాన

గత రెండుమూడు రోజులుగా వానలు దంచికొట్టాయి. దుర్గాష్టమి, మహర్నవమి, విజయదశమిల సందర్భంగా అమ్మవారి దేవాలయాల్లో విశేష పూజలు, హోమాలు చేస్తుండగా, వర్షం జోరుగా కురవడంతో భక్తులు సంతోషపడ్డారు. ఇటీవల ప్రభుత్వం వానలకోసం ఆలయాల్లో వరుణ యాగాలు చేపట్టిన నేపథ్యంలో, వానలు కురవడం అందరికీ ఆనందం కలిగించింది. నెల్లూరు నగరంలో ఈ వానల దెబ్బలకి పలుచోట్ల వాహనాల రాకపోకలకి అంతరాయం కలిగింది. మునిసిపల్ సిబ్బంది, పోలీసులు ఎప్పటికప్పుడు ట్రాఫిక్‌ని చక్కదిద్ది ప్రజలకి ఇబ్బంది లేకుండా చేశారు. జిల్లా వ్యాప్తంగా ఒక మోస్తరు నుంచి భారీ వానలు కురుస్తున్నాయి.

## పెరిగిన ప్రచారహోరు



సమావేశంలో మాట్లాడుతున్న పొంగూరు రమాదేవి, షరణి

ఎన్నికల నామినేషన్ల ఘట్టం ముగిసి కూటమి అభ్యర్థులు బి-ఫామ్‌లు అందుకోవడంతో నెల్లూరులో ప్రచార భేరీ మోగినట్లయింది. అన్ని పార్టీల వారు ఎవరికి వారు విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారాలు ప్రారంభించారు. నగరంలో రాష్ట్ర మంత్రి నారాయణ సతీమణి రమాదేవి, కుమార్తె షరణి నేతృత్వంలో కూటమి అభ్యర్థులకు విజయం చేకూర్చాలని కోరుతూ ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఇటీవల 57వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి షేక్ షబానా, 63వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి జుబేర్ ఉద్దీన్, 17వ డివిజన్ అభ్యర్థి తిరుమలనాయుడు తదితర నాయకులు, కార్యకర్తలతో కలిసి సమావేశాలను నిర్వహించి, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్నారు.

## నాన్న చేసిన అభివృద్ధిని చూసి ఓటేయండి

### • మంత్రి నారాయణ కుమార్తె సింధూర అభ్యర్థన



నెల్లూరు నగరాన్ని నెంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే తమ తండ్రి..మంత్రి నారాయణ ధ్యేయమని ఆయన తనయ డా.సింధూర చెప్పారు. ఇటీవల నెల్లూరులోని 59, 47 డివిజన్‌లలో ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొని ప్రజలతో మాట్లాడారు. నెల్లూరు నగరంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి కూటమి అభ్యర్థులైన కార్పొరేటర్లు, మేయర్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. నెల్లూరు నగరంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి దీటుగా అభివృద్ధి చేసి నిరుపేద పిల్లలకు మంచి విద్యను అందించే దిశగా తమ నాన్న అడుగులు వేశారన్నారు. అలాగే పిల్లలు ఆడుకునేందుకు పార్కులను సుందరంగా తీర్చిదిద్దారన్నారు. సొంత నిధులతో నిరుపేదలకు తోపుడు బండ్లు, ఐరన్ బాక్సులు అందించడమే కాకుండా 'నారాయణ నేత్ర జ్యోతి' పథకంతో వేలాదిమందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు, మందులు ఉచితంగా అందజేస్తున్నారన్నారు. నెల్లూరు నగరం మరింత అభివృద్ధి చెందాలంటే రానున్న నగరపాలక సంస్థ ఎన్నికల్లో మేయర్ అభ్యర్థి రూప్‌కుమార్‌యాదవ్‌ను, 59వ డివిజన్ టీడీపీ అభ్యర్థి దర్శి హరికృష్ణ, 47వ డివిజన్ అభ్యర్థి రామకృష్ణను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె కోరారు. కోరారు.

## జనసేన ఇంటింటి ప్రచారం



ఇంటింటి ప్రచారంలో గునుకుల కిషోర్, విజయలక్ష్మి దంపతులు

నెల్లూరు కార్పొరేషన్‌ను మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు 21వ డివిజన్‌లో తనను గెలిపించాలని గునుకుల విజయలక్ష్మి ప్రజలను అభ్యర్థించారు. నెల్లూరు నగరంలోని ఆదిత్యనగర్, రాంజీనగర్ ప్రాంతాల్లో 21వ డివిజన్ కూటమి అభ్యర్థి, జనసేన నాయకురాలు విజయలక్ష్మికి మద్దతుగా జనసేన నాయకులు కిషోర్ గునుకుల, జనసైనికులు, వీరమహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆమె ఇటీవల ఇంటింటికీ వెళ్ళి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. వీరమహిళ విజయలక్ష్మి, జనసేన నాయకులు ప్రశాంత్ గౌడ్, నరహరి, రాజేష్, పవన్, దార్ల నాగేంద్ర బాలు, కృష్ణమోహన్‌రెడ్డి, ప్రవళ్ళిక, విజయ, సుప్రియ, కృష్ణవేణి, శ్రీలక్ష్మి, సునీత తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుయువత నేతగా.. చక్రవర్ధన్‌రెడ్డి



నెల్లూరు రూరల్ నియోజక వర్గానికి చెందిన ప్రముఖ నాయకుడు దాట్ల చక్రవర్ధన్‌రెడ్డికి నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడిగా పదవి లభించింది. ఆమేరకు జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీద రవిచంద్ర ఇటీవల ఆయనకు ఆమేరకు ఉత్తర్వులిచ్చారు. చక్రవర్ధన్‌రెడ్డి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి సన్నిహితుడు కూడా.

## ప్రకృతి సేద్యంపై దృష్టిపెట్టండి

ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా బహువార్షిక సంటల సాగు పట్ల దృష్టి సారించాలని ఏపీ ప్రజాభాగస్వామ్య ప్రకృతివ్యవసాయం, రైతు సాధికార సంస్థ మేనేజర్ కన్నయ్య సూచించారు. నెల్లూరులో ఇటీవల ఆ సంస్థ సిబ్బంది నెల్లూరులో సమావేశమయ్యారు. జిల్లాలో రైతులు నీటి లభ్యతను బట్టి పంటలు పండించుకోవాలన్నారు. ఎలనినో వల్ల రుతుపవనాల రాక ఆలస్యం కావడం, సోమశిల జలాశయానికి ఆశించిన స్థాయిలో నీటిప్రవాహాలు రాకపోవడం వంటి అంశాలను రైతులు పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ప్రాంతీయ సాంకేతిక సమన్వయ కర్త రవిచంద్రప్రసాద్ పాల్గొన్నారు.

## చెక్‌పోస్టులు రెడీ

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలతో పోలీసు అధికారులు నెల్లూరు నగరంలో పలుచోట్ల చెక్‌పోస్టులను సిద్ధం చేశారు. చిన్నబజారు పోలీస్ స్టేషన్ పరిధిలోని నవబాల దుర్గాదేవి గుడి ప్రాంతం, నవాబుపేటలో పాత చెక్‌పోస్టు వద్ద, వేదాయపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్తూరు, అయ్యప్పగుడి వద్ద, బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్ ప్రాంతంలోని చింతారెడ్డిపాలెం, అపోలో ఆసుపత్రి కూడలి వద్ద ఈ చెక్‌పోస్టులను ఏర్పాటుచేసినట్లు పోలీసులు తెలిపారు.

## రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సిలింగ్

స్థానిక ఎన్నికల నేపథ్యంలో, శాంతిభద్రతల పరిరక్షణకు భంగం వాటిల్లకుండా జిల్లా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లు, అసాంఘిక చరిత్ర కలిగిన వారికి జిల్లా పోలీసు అధికారులు గట్టి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎన్నికల సందర్భంలో బెదిరింపులకు పాల్పడడం, గొడవలకు దిగడం వంటివి చేస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఏ వీధికి వెళ్లినా..
# 'కూటమి' చేసిన అభివృద్ధే కనిపిస్తోంది

➤ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



ప్రజలకి కూటమి ప్రభుత్వ అభివృద్ధిని వివరిస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు నగరంలో ఏ వీధికి వెళ్లినా కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధే కనిపిస్తోందని, ఎక్కడ చూసినా ప్రజలు టీడీపీకి బ్రహ్మరథం పడుతున్నారని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. ఈనెల 21నఆయన నగరంలోని 70వ డివిజన్‌లో 'చెప్పాం-చేస్తున్నాం' కార్యక్రమంలో భాగంగా జరిగిన ఇంటింటి ప్రచారంలో పాల్గొని ప్రజలతో మాట్లాడారు. స్థానిక ప్రజలతో ఆయన ఆత్మీయంగా మాట్లాడుతూ వారి సమస్యలు తెలుసుకున్నారు. రాష్ట్రం ప్రగతి పథంలో ముందుకు పయనిస్తోందని, రాష్ట్ర రాజధాని అమరావతి కేంద్రంగా రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలయ్యేలా ముఖ్యమంత్రి సమర్థవంతమైన పాలన అందిస్తున్నారని ఆయన ప్రజలకు వివరించారు. ఎప్పటికప్పుడు ప్రజల అవసరాలను గుర్తించి, రాష్ట్ర ప్రగతికి ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతున్న చంద్రబాబు నాయకత్వం రాష్ట్ర అభివృద్ధికి దిశానిర్దేశం చేస్తోందని తెలిపారు. నెల్లూరు నగరంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు స్పష్టంగా కనిపిస్తున్నాయని, నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల సహకారం, మద్దతు ఎంతో అవసరమని చెప్పారు. మంత్రి పొంగూరు నారాయణ వంటి నాయకుడిని ఎన్నుకోవడం నెల్లూరు నగర ప్రజల అదృష్టమన్నారు. నగర అభివృద్ధికి నాయకత్వం, సమన్వయం, నిరంతర కృషి అవసరమని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగాలని పేర్కొన్నారు. అభివృద్ధి కొనసాగాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. నెల్లూరు నగరం మరింత అభివృద్ధి చెందాలన్నా, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందాలన్నా, సంక్షేమ కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగాలన్నా స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల మద్దతు కొనసాగాలని, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థి పోలుబోయిన రూప్‌కుమార్‌యాదవ్‌ను, 70వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి రాచగిరి చంద్రను గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తద్వారా నెల్లూరు నగరాన్ని మరింత ప్రగతిపథంలో నడిపించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

## కేసుల విచారణ పూర్తయ్యేవరకు..
# జగన్ రాజకీయాలకి దూరంగా ఉండాలి

• మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి



జగన్‌కి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా, ఆయనకు సంబంధించిన కేసుల విచారణ పూర్తయ్యేంత వరకూ రాజకీయాలకు దూరంగా ఉండాలని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఆయన నెల్లూరులో విలేకర్లతో మాట్లాడుతూ, సీబీఐకి, ఇ.డికి కూడా సమయం చాలనంతంగా జగన్‌రెడ్డి అనేక కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని, కల్తీ నెయ్యితో తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని అపవిత్రం చేసి పాపం మూటగట్టుకున్నారని, ఇ.డి విచారణతో కల్తీనెయ్యి గుట్టు అంతా కూడా బయటపడబోతోందన్నారు. అవినీతి, అక్రమాలు, కేసులతో దేశ రాజకీయాల్లోనే జగన్ రెడ్డి ఒక అరుదైన వ్యక్తిగా నిలిచారని, ఒకటి కాదు..రెండు కాదు... సీబీఐ, ఈడీకి సమయం చాలనంత కేసులన్నీ దేశంలో ఒక్క జగన్మోహన్‌రెడ్డిపై ఉన్నాయని అన్నారు. గతంలో తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని రూ.43 వేల కోట్ల అక్రమాస్తులు సంపాదించిన కేసులో సీబీఐ కోర్టు రోజువారీ విచారణ జరిపే పరిస్థితి వచ్చిందని ఆయన అన్నారు. జాతీయ స్థాయిలో పనిచేసే ఈడీ, సీబీఐలకి జగన్‌రెడ్డితో పాటు ఆయన ఇలాకాకు సంబంధించిన కేసుల విచారణకే టైం అంతా సరిపోతోందన్నారు. రేపు సీబీఐ కోర్టులో రోజువారి విచారణలు మొదలైతే వందలాది మంది సాక్షులను విచారించాల్సి ఉంటుందని, జగన్‌రెడ్డి రోజూ కోర్టుకు రావాలని ఆయన అన్నారు. ఈ కేసులన్నింటిలో విచారణ పూర్తయ్యేంత వరకు రాజకీయాలకు దూరంగా ఉండాలని జగన్‌రెడ్డికి హితవు పలుకుతున్నామని ఆయన అన్నారు.

# అభివృద్ధిని చూసి.. మద్దతు ఇవ్వండి

కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సమక్షంలో నామినేషన్ దాఖలు చేస్తున్న దొడ్ల విజయలక్ష్మి

బుచ్చిరెడ్డిపాళెంలో గత రెండున్నరేళ్లలో జరిగిన అభివృద్ధిని, ప్రజలకు అందుతున్న సంక్షేమాన్ని బేరీజు వేసుకొని స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ప్రజలు మద్దతు తెలపాలని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పిలుపునిచ్చారు. బుచ్చిరెడ్డిపాళెం మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థినిగా కూటమి తరపున ఎంపికైన దొడ్ల విజయలక్ష్మి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సమక్షంలో రిటర్నింగ్ అధికారికి ఇటీవల నామినేషన్ పత్రాలు సమర్పించారు. అనంతరం ఎమ్మెల్యే విలేకర్లతో మాట్లాడుతూ, రెండున్నరేళ్ల క్రితం బుచ్చిరెడ్డిపాళెం పరిస్థితులు ఎలా ఉన్నాయి, ప్రస్తుతం ఎలాంటి అభివృద్ధి జరిగిందనే విషయాలను ప్రజలు పరిశీలించి ఓటు వేయాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తిచేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి దొడ్ల విజయలక్ష్మి, కూటమి కౌన్సిలర్ అభ్యర్థులందరూ విజయం సాధిస్తారనే ధీమాను ఆమె వ్యక్తం చేశారు.

## ఆత్మకూరులో క్లీన్‌స్వీప్ లక్ష్యంగా..
# మంత్రి ఆనం వ్యూహం



మున్సిపల్ ఛైర్మెన్ అభ్యర్థిని డాక్టర్ షకీలతో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థినిగా డాక్టర్ బొమ్మిరెడ్డి షకీలా ఇటీవల తన నామినేషన్ దాఖలు చేశారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సహకారంతో ఆమె ఎన్నికల రంగంలో నిలిచారు. మంచి విద్యావంతురాలు, వైద్యరంగంలో అనుభవం కలిగిన వ్యక్తి, ప్రజాసేవ పట్ల ఆసక్తి ఉన్న డాక్టర్ షకీలాకు అవకాశం కల్పించడం ద్వారా మహిళా నాయకత్వానికి, విద్యావంతులకు ప్రాధాన్యత ఇచ్చినట్లయిందని కూటమి వర్గాలు భావిస్తున్నాయి. మంత్రి ఆనం రాజకీయ అనుభవం, అభివృద్ధిపై దృష్టి, కూటమి నాయకులు, కార్యకర్తల సమన్వయంతో 28 వార్డుల్లోనూ విజయమే లక్ష్యంగా కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రచార రంగంలోకి దిగారు. ఆత్మకూరులో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తూ పట్టణ ప్రగతికి ప్రాధాన్యతనిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రానున్న మున్సిపల్ ఎన్నికల్లోనూ అభివృద్ధి మంత్రాన్నే ప్రధాన అస్త్రంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఆత్మకూరులో కూటమి అభ్యర్థులు క్లీన్ స్వీప్ చేసే విధంగా మంత్రి ఆనం తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేస్తూ, వార్డులవారీగా ఎన్నికల కార్యాచరణపై దృష్టి సారిస్తున్నారు. కూటమి శ్రేణుల్లో ఉత్సాహాన్ని పెంచుతూ, సమష్టి కృషితో ఎన్నికలను ఎదుర్కొనేలా నాయకులను, కార్యకర్తలను సమాయత్తం చేస్తున్నారు.

### 28 వార్డులకు అభ్యర్థులు రెడీ!

ఆత్మకూరు పురపాలక ఎన్నికల్లో పోటీ చేయనున్న 28 వార్డుల ఎన్డీఏ కూటమి అభ్యర్థులను రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇటీవల ఆత్మకూరు సభలో ప్రకటించడంతో ఆయా వర్గాల్లో ఉత్సాహం ఉరకలు వేసింది. మంత్రి ఆనం స్వయంగా అభ్యర్థులను ప్రకటించడంతో నాయకులు, కార్యకర్తలు సంబరపడ్డారు. ఆత్మకూరు సమగ్ర అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా, ఆత్మకూరు పురపాలక సంఘంలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి ఈ సందర్భంగా చెప్పారు.

# కామాక్షితాయి సేవలో.. డా. సతీష్‌రెడ్డి



నెల్లూరుజిల్లాకి చెందిన ప్రముఖ శాస్త్రవేత్త, డీఆర్డీవో మాజీ ఛైర్మెన్ డా. గుండ్రా సతీష్‌రెడ్డి ఈనెల 20న బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని ప్రముఖ దేవస్థానం శ్రీ మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయాన్ని సందర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. దైవ దర్శనానంతరం ఆలయ ఆవరణలో అర్చకులు, వేద పండితులు సతీష్‌రెడ్డికి వేదాశీర్వచనం అందజేసి స్వామి అమ్మవార్ల శేష వస్త్రాలతో సత్కరించారు. ఆలయ ఛైర్మెన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ మరియు, ఆలయ కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.




# యువతకు ఆర్థిక జ్ఞానం : భవిష్యత్తును వెలిగించే మార్గదర్శి

మనిషి జీవితంలో ఆర్థిక జ్ఞానం అనేది ఒక వెలుగు. ఆ వెలుగు వెలిగితే మన ప్రయాణం స్పష్టంగా కనిపిస్తుంది; అది లేకపోతే మనం చీకటిలో నడుస్తున్నట్లే. ముఖ్యంగా యువతకు ఆర్థిక జ్ఞానం అత్యంత అవసరం. ఎందుకంటే వారు తీసుకునే చిన్న చిన్న ఆర్థిక నిర్ణయాలు భవిష్యత్తులో పెద్ద ప్రభావం చూపుతాయి. "డబ్బు మనిషిని మార్చదు; మనిషి డబ్బును ఎలా ఉపయోగిస్తాడో అది అతని భవిష్యత్తును మార్చుతుంది" అనే మాటలో ఉన్న సత్యాన్ని యువత గ్రహించాలి. ఆర్థిక జ్ఞానం అంటే కేవలం డబ్బు సంపాదించడం కాదు; డబ్బును అర్థం చేసుకోవడం, డబ్బుతో బాధ్యతగా వ్యవహరించడం, డబ్బును భవిష్యత్తు నిర్మాణానికి ఉపయోగించడం. యువతకు ఆర్థిక జ్ఞానం అంటే డబ్బు విలువను అర్థం చేసుకోవడం. ఒక విద్యార్థి తనకు వచ్చిన జేబు ఖర్చు (pocket money)ని ఎలా ఉపయోగిస్తాడో అతని ఆర్థిక అలవాట్లకు పునాది. ఒక యువకుడు తన మొదటి ఉద్యోగంలో వచ్చిన జీతంని ఎలా నిర్వహిస్తాడో అతని భవిష్యత్తు ఆర్థిక స్థిరత్వాన్ని నిర్ణయిస్తుంది. ఉదాహరణకు, ఒక విద్యార్థి ప్రతినెలా తన జేబు ఖర్చులో కొంత భాగాన్ని పొదుపు చేస్తే, అతనిలో ఆర్థిక క్రమశిక్షణ పెరుగుతుంది. అతను చిన్న చిన్న ఖర్చులను నియంత్రించడం నేర్చుకుంటాడు. ఒక యువతి తన మొదటి జీతంలో కొంత భాగాన్ని అత్యవసర నిధి (emergency fund)గా పెట్టుకుంటే, ఆమెకు భవిష్యత్తులో ఆర్థిక భయం ఉండదు. ఇవి చిన్న నిర్ణయాలు, కానీ పెద్ద ప్రయోజనాలు.

ఆర్థిక జ్ఞానం యువతకు స్వీయ నియంత్రణను నేర్పుతుంది. డబ్బు వచ్చినప్పుడు వెంటనే ఖర్చు చేయడం సులభం. కానీ ఆ డబ్బును సరిగ్గా ఉపయోగించడం జ్ఞానం. 'ఖర్చు చేయడం ఒక అలవాటు; పొదుపు చేయడం ఒక నైపుణ్యం' అనే మాట యువతకు మార్గదర్శకం. ఒక యువకుడు తనకు వచ్చిన జీతంని పూర్తిగా ఖర్చు చేస్తే, అతనికి భవిష్యత్తులో ఆర్థిక సమస్యలు వస్తాయి. కానీ అతను కొంత భాగాన్ని పొదుపు చేస్తే, అతని భవిష్యత్తు వెలుగుతో నిండిపోతుంది. ఆర్థిక జ్ఞానం యువతకు బాధ్యతను నేర్పు తుంది. డబ్బు అనేది కేవలం ఖర్చు చేయడానికి కాదు; అది భవిష్యత్తును నిర్మించడానికి. ఒక యువతి తన డబ్బును సరిగ్గా ఉపయోగిస్తే, ఆమెకు భవిష్యత్తులో ఆర్థిక స్వాతంత్ర్యం వస్తుంది. ఒక యువకుడు తన డబ్బును పెట్టుబడిగా పెట్టుకుంటే, అతనికి భవిష్యత్తులో ఆర్థిక స్థిరత్వం వస్తుంది.

యువత ఆర్థిక జ్ఞానాన్ని పెంచుకోవా లంటే ముందుగా ఆర్థిక విద్య (financial education) పై ఆసక్తి పెంచుకోవాలి. పుస్తకాలు చదవడం, చిన్న కోర్సులు (online courses) చేయడం, తల్లిదండ్రులతో ఆర్థిక విషయాలు చర్చించడం.

జ్ఞాన నేత్రం
డా. నరసింహారెడ్డి ఊరిమిండి
Dallas, Texas, USA

ఆ తర్వాత చిన్న చిన్న ఆర్థిక ప్రయోగాలు చేయాలి : ఉదాహరణకు, ప్రతినెలా రూ.500 ని ఒక చిన్న పొదుపు ప్రాజెక్ట్‌గా పెట్టడం, ఒక చిన్న పెట్టుబడి (micro investment) ప్రయత్నించడం, లేదా ఒక చిన్న బడ్జెట్ రూపొందించి ఒక నెల పాటించడం. ఇవి యువతకు ఆర్థిక ధైర్యాన్ని ఇస్తాయి. ముఖ్యంగా, ఆర్థిక విజయాన్ని కొలిచే ప్రమాణాలు (financial metrics) స్పష్టంగా ఉండాలి. పొదుపుశాతం (savings rate), అత్యవసర నిధి (emergency fund) పరిమాణం, అప్పు లేని జీవనం (debt free status), మరియు నెలవారీ పెట్టుబడి స్థిరత్వం (investment consistency). ఈ ప్రమాణాలు యువతకు తమ ఆర్థిక ప్రయాణం ఎక్కడ ఉందో, ఎక్కడికి వెళ్లాలో స్పష్టంగా చూపిస్తాయి. పెట్టుబడి అనేది యువతకు అత్యంత ముఖ్యమైన నైపుణ్యం. చిన్న మొత్తాలు కూడా పెద్ద ప్రయోజనాలు ఇస్తాయి. ఉదాహరణకు, ఒక విద్యార్థి ప్రతినెలా ₹20ని పెట్టుబడిగా పెట్టుకుంటే, కొన్ని సంవత్సరాల్లో అది పెద్ద మొత్తంగా మారుతుంది. ఇది చక్రవడ్డీ (compound interest) అనే శక్తి. "పొదుపు నీకు భద్రత ఇస్తుంది; పెట్టుబడి నీకు భవిష్యత్తు ఇస్తుంది" అనే మాట యువతకు అర్థం కావాలి. ఆర్థిక జ్ఞానం యువతకు నిర్ణయ సామర్థ్యాన్ని పెంచుతుంది. ఒక యువకుడు కొత్త ఫోన్ కొనాలనుకుంటే, అతను రెండు ప్రశ్నలు వేసుకోవాలి. "నాకు ఇది అవసరమా?" "ఇది నా పొదుపును ప్రభావితం చేస్తుందా?" ఈ రెండు ప్రశ్నలు అతని ఆర్థిక నిర్ణయాలను సరిదిద్దుతాయి. ఒక యువతి కొత్త దుస్తులు కొనాలనుకుంటే, ఆమె కూడా ఇదే ప్రశ్నలు వేసుకోవాలి. అవసరం, ప్రాధాన్యం, భవిష్యత్తు..ఇవి ఆర్థిక నిర్ణయాల మూడుస్తంభాలుగా గుర్తించాలి.

ఆర్థిక జ్ఞానం యువతకు స్వీయ గౌరవాన్ని పెంచుతుంది. డబ్బు సరిగ్గా ఉపయోగించగలిగినప్పుడు మనలో ఆత్మవిశ్వాసం (confidence) పెరుగుతుంది. మన నిర్ణయాలు బలంగా మారుతాయి. మన భవిష్యత్తు స్పష్టంగా కనిపిస్తుంది. ఆర్థిక జ్ఞానం యువతకు భవిష్యత్తును నిర్మించే శక్తి. ఒక విద్యార్థి తన డబ్బును సరిగ్గా ఉపయోగిస్తే, అతనికి భవిష్యత్తులో ఆర్థిక జ్ఞానం అనేది యువతకు జీవితాన్ని వెలిగించే మార్గదర్శి. డబ్బు అనేది కేవలం ఖర్చు చేయడానికి కాదు; అది భవిష్యత్తును నిర్మించ డానికి. డబ్బు విలువ, పొదుపు, పెట్టుబడి, బాధ్యత..ఇవన్నీ యువతకు అత్యంత ముఖ్యమైన నైపుణ్యాలు. "డబ్బు నీకు శక్తి కాదు; డబ్బును ఎలా ఉపయోగిస్తావో అదే నీ శక్తి".. అనే మాట యువతకు మార్గదర్శకం. ఆర్థిక జ్ఞానం ఉన్న యువత భవిష్యత్తును నిర్మించగలరు. ఆర్థిక జ్ఞానం ఉన్న యువత ఆర్థిక స్వాతంత్ర్యం పొందగలరు. ఆర్థిక జ్ఞానం ఉన్న యువత తమ జీవితాన్ని వెలిగించగలరు.

'యువతకు ఆర్థిక జ్ఞానం అంటే భవిష్యత్తుకు వెలుగు; ఆ వెలుగును వెలిగించడం వారి చేతుల్లోనే ఉంది'!...

**వచ్చే వారం :** అసత్యాల అల్లకల్లోలంలో విమర్శనాత్మక ఆలోచన : నిజాన్ని గుర్తించే మనసు శక్తి



E-mail: reddyu@gmail.com

## 'స్థానిక' విజయమే లక్ష్యంగా..
# కలసికట్టుగా పనిచేయాలి

- పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే కాకర్ల దిశానిర్దేశం



స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వింజమూరు మండలం బొమ్మరాజు చెరువులోని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ క్యాంపు కార్యాలయంలో వింజమూరు మండల నాయకులు, ఉదయగిరి నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులతో ఇటీవల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా అనుసరించాల్సిన వ్యూహాలు, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే అంశాలపై ఆయన చర్చించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో చోటు చేసుకున్న దౌర్జన్యాలు, ప్రజలకు జరిగిన అన్యాయాలు, పాలనలోని వైఫల్యాలను ప్రజలకు గుర్తుచేయడంతో పాటు, ప్రస్తుత కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఆయన నాయకులకు సూచించారు. ప్రభుత్వం ప్రజల కోసం చేస్తున్న కార్యక్రమాలను ప్రతి గ్రామంలోనూ, ప్రతి ఇంటికీ చేరవేసేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు. వింజమూరు మండలంలోని అన్ని ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని తెలిపారు.

## వాగ్గేయకారుల
# ప్రతిభ అపూర్వం



డా. రాణీ నాగశ్రీ

తెలుగు భాషకు మన వాగ్గేయకారుల సాహిత్య సంగీత వైభవం అపూర్వమని తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డా. రాణీ నాగశ్రీ శైలేశ్వరి చెప్పారు. ఇటీవల ఆమె నెల్లూరులోని చేతన సంస్థ నిర్వహించిన సాహిత్యసభలో "వాగ్గేయకారుల సాహిత్య సంగీత వైభవం" అనే అంశం గురించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె వాగ్గేయకారులు పాడిన పలు సంకీర్తనలు, కృతులు గానంచేసి సభను రంజింప చేశారు. అనంతరం వక్తను నిర్వాహకులు సత్కరించారు. చేతన సంస్థ కార్యదర్శి వై. శేషగిరీశం ఆధ్వర్యంలో ప్రముఖ కవయిత్రి గోవిందరాజు సుభద్రాదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎం.నారాయణ మూర్తి, సాహితీవేత్తలు డాక్టర్ గంగిశెట్టి శివకుమార్, బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, ప్రపంచ తెలుగు సమాఖ్య రీజినల్ చైర్మన్ నలబోలు బలరామయ్యనాయుడు పాల్గొన్నారు.

# తల్లిఒడికి చేరిన..బాలిక



బాలికని తల్లికి అప్పగిస్తున్న డీసీపీయూ సిబ్బంది

మంగళగిరి నుంచి ఇటీవల ఇంటి నుంచి వెళ్లిపోయి గూడూరు రైల్వేస్టేషన్‌కు చేరుకున్న బాలికను డీసీపీయూ, చైల్డ్‌లైన్ సిబ్బంది సమన్వయంతో సంరక్షించి, కౌన్సెలింగ్ అనంతరం తల్లికి అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. మంగళగిరికి చెందిన ఓ బాలిక ఇంట్లో పనులు సక్రమంగా చేయలేదని తల్లి మందలించడంతో మనస్తాపానికి గురై ఇంటి నుంచి వెళ్లిపోయింది. మంగళగిరి రైల్వేస్టేషన్‌లో రైలెక్కి గూడూరు రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. అక్కడ విధుల్లో ఉన్న జీఆర్పీ/ఆర్పీఎఫ్ పోలీసులు ఆ బాలికను గుర్తించి హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించారు. దీంతో జిల్లా బాలల సంరక్షణ విభాగం సిబ్బంది, చైల్డ్‌లైన్ సిబ్బంది సమన్వయంతో బాలిక తల్లిదండ్రుల వివరాలను సేకరించి, ఆమె తల్లికి సమాచారం అందించారు. ఈ నేపథ్యంలో ఈనెల 16న బాలిక తల్లిని పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం బాలికను ఆమె తల్లికి అప్పగించారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి బి.సురేష్ ఆదేశాల మేరకు డీసీపీయూ, చైల్డ్‌లైన్ సిబ్బంది సమన్వయంతో ఈ చర్యలు చేపట్టారు.

# టీడీపీలోకి ఊపందుకున్న వలసలు



ఎమ్మెల్యే సోమిరెడ్డి సమక్షంలో తెలుగుదేశంపార్టీలో చేరుతున్న 43 కుటుంబాలు

స్థానిక ఎన్నికల వేళ సర్వేపల్లి నియోజకవర్గంలోని వరకవిపూడి పంచాయతీకి చెందిన 43 కుటుంబాలు ఇటీవల వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. టీపీ గూడూరు పీఏసీఎస్ అధ్యక్షులు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో వారు టీడీపీలోకి చేరారు. అల్లీపురంలోని నివాసంలో జరిగిన కార్యక్రమంలో అందరికీ ఆత్మీయ ఆహ్వానం పలికిన సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ, ఇదొక శుభ పరిణామమన్నారు. దళితులు, గిరిజనులు, బీసీలతో పాటు అందరూ టీడీపీలో చేరడం సంతోషంగా ఉందని, ఈ వరుస చేరికలతో వరకవిపూడిలో వైసీపీ దాదాపు ఖాళీ అయిన పరిస్థితి కనిపిస్తోందని తెలిపారు.

# పెయిడ్ న్యూస్‌పై పర్యవేక్షణ ఉండాలి

- అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు రాజకీయ ప్రకటనలను ప్రచారం చేసుకునే ముందు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ నుంచి ముందస్తు ధ్రువీకరణ పొందాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఇటీవల ఒక ప్రకటనలో తెలిపారు. తమ అధ్యక్షతన జిల్లా స్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటయిందని, ఇందులో నెల్లూరు మున్సిపల్ కమిషనర్ నందన్, ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, బుచ్చిరెడ్డి పాలెం మున్సిపల్ కమిషనర్ చినబాబు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి వేణుగోపాల్‌రెడ్డి మెంబర్లుగా ఉంటారని ఆయన తెలిపారు. ఎన్నికల సమయంలో ఎలక్ట్రానిక్ మీడియా, ప్రింట్ మీడియా, సోషల్ మీడియా, కేబుల్ నెట్‌వర్క్‌లు, రేడియో, సినిమా హాల్స్, బల్క్ ఎస్ఎంఎస్‌లు తదితర మాధ్యమాల్లో ప్రసారమయ్యే రాజకీయ ప్రకటనలను పర్యవేక్షించడంతో పాటు, పెయిడ్ న్యూస్‌పై కూడా ఎంసీఎంసీ కమిటీ నిఘా ఉంచుతుందని కలెక్టర్ తెలిపారు. వివిధ మాధ్యమాల ద్వారా రాజకీయ ప్రకటనలు ప్రచారం చేయాలనుకునే రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నిబంధనల ప్రకారం ముందస్తు ధ్రువీకరణ పొందాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఒక అభ్యర్థికి లేదా రాజకీయ పార్టీకి అనుకూలంగా వార్తల రూపంలో ప్రచురించే పెయిడ్ న్యూస్‌ను గుర్తించి, సంబంధిత నిబంధనల ప్రకారం పర్యవేక్షించే బాధ్యతను కూడా ఎంసీఎంసీ నిర్వహిస్తుందని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, స్వేచ్ఛాయుతమైన మరియు నిష్పక్షపాతమైన ఎన్నికలు, అన్ని రాజకీయ పార్టీలు మరియు అభ్యర్థులకు సమాన అవకాశాలు కల్పించడమే ఈ మార్గదర్శకాల ప్రధాన ఉద్దేశమని, రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థులు, మీడియా సంస్థలు రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

# సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాం

## -- ఎన్నికల సంఘం కమిషనర్‌కి వివరించిన జిల్లా అధికారులు --



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ అజిత వేజెండ్ల

స్థానిక ఎన్నికల నేపథ్యంలో, జిల్లాలో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా, భద్రతా చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ హిమాన్షు శుక్ల వెల్లడించారు. పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణ, పోలీసు బందోబస్తుతో పాటు అత్యంత సమస్యాత్మక కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సోమవారం సాయంత్రం అమరావతి సచివాలయం నుంచి రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్లు, ఎన్నికల పరిశీలకులు, ఎస్పీలకు ఎన్నికల నిర్వహణపై మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల, ఎన్నికల జనరల్ అబ్జర్వర్ సదా భార్గవి ఎన్నికల నిర్వహణకు సంబంధించి నోడల్ అధికారులతో కలెక్టరేట్లోని ఎస్.ఆర్ శంకరన్ హాల్లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఇప్పటికే మున్సిపాలిటీలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పూర్తయిందని, ఈ నెల 28న జరగనున్న పోలింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ ఎన్నికల కమిషనర్‌కి తెలిపారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సుమారు 4వేల మంది పోలీసు సిబ్బందిని వినియోగించేందుకు ప్రణాళిక రూపొందించామని తెలిపారు. అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఎస్పీ వివరించారు.

### ముగిసిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ

నెల్లూరు నగరపాలక సంస్థ సాధారణ ఎన్నికలకు సంబంధించి మేయర్, కార్పొరేటర్ స్థానాలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఆదివారంతో ముగిసింది. చివరి రోజు భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. మేయర్ అభ్యర్థిత్వానికి వివిధ రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల నుంచి మొత్తం 35 నామినేషన్లు స్వీకరించినట్లు అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ.నందన్ తెలిపారు. మేయర్ స్థానానికి బీఎస్పీ నుంచి 1, బీజేపీ నుంచి 2, ఐఎన్‌సీ నుంచి 5, టీడీపీ నుంచి 5, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నుంచి 5, జనసేన నుంచి 1, ఇతర పార్టీల నుంచి 3, స్వతంత్ర అభ్యర్థుల నుంచి 13 నామినేషన్లు అందినట్లు ఆయన వెల్లడించారు. అదేవిధంగా కార్పొరేటర్ స్థానాలకు రాజకీయ పార్టీల వారీగా బీఎస్పీ నుంచి 1, బీజేపీ నుంచి 28, సీపీఎం నుంచి 8, సీపీఐ నుంచి 13, టీడీపీ నుంచి 209, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి 233, ఐఎన్‌సీ నుంచి 28, జనసేన నుంచి 56, ఇతర పార్టీల నుంచి 18, స్వతంత్ర అభ్యర్థుల నుంచి 69 నామినేషన్లు అందాయి. గడువు ముగిసే సమయానికి కార్పొరేటర్ స్థానాలకు మొత్తం 663 నామినేషన్లు స్వీకరించినట్లు కమిషనర్ తెలిపారు.

# దీవెనను దీవించండి

## నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో నామినేషన్ దాఖలు చేస్తున్న వైకాపా అభ్యర్థి బొలిగర్ల దీవెన

వెంకటగిరి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా వైఎస్సార్‌సీపీ తరఫున తొలి నామినేషన్ దాఖలైంది. వెంకటగిరి వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డితో కలిసి బొలిగర్ల దీవెన ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా ఇటీవల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పార్టీ శ్రేణుల సందడితో నామినేషన్ కేంద్రం వద్ద రాజకీయ వాతావరణం నెలకొంది. వెంకటగిరి మున్సిపాలిటీలో విజయం సాధించడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ తరఫున పలువురు కౌన్సిలర్ అభ్యర్థులు సైతం ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. ఈ సందర్భంగా దీవెన మాట్లాడుతూ, వెంకటగిరి పట్టణ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని, పట్టణ ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించాలని కోరారు.

ఈ సందర్భంగా నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వెంకటగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ పదవికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా దీవెన తొలి నామినేషన్ దాఖలు చేయడం శుభపరిణామమని వైసీపీ నేత నేదురుమల్లి ప్రజలకు విజ్ఞప్తిచేశారు. సమర్థత, అంకిత భావం కలిగిన బొలిగర్ల దీవెనను మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నుకోవాలని, వెంకటగిరి అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారం లక్ష్యంగా ప్రజలకు మంచి చేసే అభ్యర్థులకు ప్రజలు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు.

# గూడూరు డివిజన్

## నమ్మి వచ్చిన వారికి అండగా ఉంటాం

### ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్



టీడీపీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

తమను నమ్మి తెలుగుదేశం పార్టీలో చేరిన వారికి అండగా ఉంటామని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ తెలిపారు. ఇటీవల చిల్లకూరు జ్యోతి వేబ్రిడ్జి వద్ద చింతవరం, ఉడతావారిపాలెం పంచాయతీలకి చెందిన వైసీపీ నాయకులు భారీగా టీడీపీలో చేరారు. చింతవరం పంచాయితీ నుంచి మొగిలిగుంట రవి, ఉడతావారిపాలెం పంచాయితీ నుంచి మాజీ ఎంపీటీసీ సన్నారెడ్డి చంద్రారెడ్డిల ఆధ్వర్యంలో సుమారు 500 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. వీరందరినీ పార్టీ నాయకుల నడుమ ఎమ్మెల్యే సునీల్ టీడీపీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి పాలనలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం చూసి వీరంతా తెలుగుదేశం పార్టీలో చేరడం చాలా సంతోషంగా ఉందన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, చిరంజీవి, కోట సతీష్‌యాదవ్, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

## మహిళా మండలికి 'నెల్‌క్యాస్ట్' కుట్టుమిషన్లు




గూడూరులోని ఆంధ్ర మహిళా మండలి కార్యాలయంలో మహిళా మండలి మరియు ఇన్నర్ విల్ క్లబ్ సభ్యులు విజయదశమి సందర్భంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గూడూరు నెలక్యాస్ట్ ఫ్యాక్టరీ ప్రతినిధులు కంపెనీ సీఎస్ఆర్ నిధులతో 70 వేల రూపాయలు విలువ గలిగిన కుట్టుమిషన్లు క్లబ్ సభ్యులకు అందజేశారు. కంపెనీ ప్రతినిధులను మహిళా మండలి సభ్యులు సన్మానించారు. మహిళా మండలి గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ రోహిణి, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు నిర్మల, సుప్రియ, విష్ణువందన, శశికళ, సుప్రజ, పవిత్ర, కంపెనీ ప్రతినిధులు ఎన్.ఎస్.రెడ్డి, ఆనిమెళ్ళ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మొదటిరోజు 14 నామినేషన్లు



రాష్ట్రవ్యాప్తంగా ఎంపీటీసీల నామినేషన్‌లో భాగంగా గూడూరు పట్టణంలో ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆర్వోగా మల్లికార్జునరావు వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటిరోజు టీడీపీ నుండి 14 నామినేషన్లు వచ్చాయన్నారు. గూడూరు మండల పరిధిలో 8 సెగ్మెంట్లకు గాను 14 నామినేషన్లు దాఖలయ్యాయని, వెడిచర్ల -2, కొండగుంట-2, మేకనూరు-2, కొమ్మనేటూరు-2, తిప్ప వరపాడు-1, వెందోడు-1, విందూరు-2, సంతదాసుపల్లి-2 నామినేషన్లు చొప్పున టీడీపీ పార్టీ దాఖలు చేసిందని తెలిపారు. మొదటిరోజు నామినేషన్‌లు కావడంతో అభ్యర్థుల తరఫున ప్రజలు గ్రామాల నుండి తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొంది. పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. వైసీపీ నుండి గూడూరు రూరల్ మండలం సంతదాసుపల్లి సెగ్మెంట్ అభ్యర్థి సంపూర్ణమ్మ నామినేషన్ కేంద్రంలోకి వెళ్లాక తన చేతిలోని నామినేషన్ పత్రాలను గుర్తుతెలియని వ్యక్తి లాక్కుని వెళ్లిపోయినట్లు ఆరోపించారు. ఒకటవ పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## రోడ్డు ఆక్రమిస్తే చర్యలు తప్పవు




గూడూరు పట్టణంలోని పాత బస్టాండ్‌లో పూల దుకాణాల వారు రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేయడం వల్ల టర్నింగ్‌ల వద్ద ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆర్టీసీ బస్సు డ్రైవర్లు ఇటీవల గూడూరు సీఐ శ్రీనివాసరావుకి తెలియజేశారు. దీంతో ఆయన వెంటనే ఆర్టీసీ పరిసర ప్రాంతాలను పరిశీలించి పూల అంగళ్ళ యజమానులతో మాట్లాడారు. డ్రైవర్లకి ఇబ్బందులు లేకుండా వ్యాపారం చేసుకోవాలని లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని వారిని హెచ్చరించారు.



గ్రామస్తులకి అవగాహన కలిగిస్తున్న పోలీసులు

## మంగళాపురంలో 'రూట్ మార్చ్'

స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈనెల 21వతేదీ గూడూరు డీఎస్పీ ఆధ్వర్యంలో గూడూరు రూరల్ సీఐ, 1వపట్టణ సీఐ, 2వపట్టణ సీఐలు 40మంది పోలీసు సిబ్బందితో గూడూరు రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అత్యంత సున్నితమైన మంగళాపురం, వేదిచెర్ల గ్రామాలలో రూట్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా, పోలింగ్ కేంద్రాల ప్రదేశాలను తనిఖీ చేశారు. జరగబోయే గ్రామ పంచాయతీ, జడ్పీటీసీ మరియు ఎంపీటీసీ ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా చూసుకోవాలని, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని గ్రామస్తులకు సూచించారు. చట్టవిరుద్ధమైన కార్యకలాపాలలో పాల్గొనే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని కూడా వారిని హెచ్చరించారు. ఆపరేషన్ త్రిశూల్ గురించి కూడా గ్రామస్తులలో అవగాహన కల్పించారు.

## విద్యుత్ బస్సుల టెండర్‌ను ఆపాలి



టెండర్‌లని ఆపాలంటూ ధర్నా నిర్వహిస్తున్న జేఏసీ నాయకులు

ఏపీటీటీడీ రాష్ట్ర జె.ఏ.సి పిలుపు మేరకు అద్దె బస్సుల టెండర్‌ను నిలిపివేయాలంటూ ఇటీవల గూడూరు డిపో జె.ఏ.సి నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 1450 అద్దె విద్యుత్ బస్సుల కొరకు జి.సి.సి పద్ధతిలో ప్రభుత్వం టెండర్‌ను పిలవడం సరికాదని అన్నారు. విద్యుత్ బస్సులను నేరుగా ఆర్టీసీ ద్వారా నడపాలన్నారు. అనంతరం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జె.ఏ.సి నాయకులు కె.శ్రీనివాసులు, శ్రీధర్, ప్రవీణ్, జనార్ధన్, గౌస్, ఎస్.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు రూరల్ మండల టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థిగా వంటేరు వేణుగోపాల్‌రెడ్డికి బీఫామ్‌ని అందజేస్తున్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి.

### నిరంతరం ప్రజల్లో ఉండే..

# వైసీపీనే గెలిపించండి



తమ పార్టీవారిని గెలిపించాలంటూ ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

రానున్న ఎన్నికల్లో నిరంతరం ప్రజలకోసం శ్రమించే వైసీపీ అభ్యర్థులనే గెలిపించాలని వైసీపీ నేత, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి స్థానిక ప్రజలకు పిలుపునిచ్చారు. ఇటీవల ఆయన నెల్లూరులోని 61వ డివిజన్ అభ్యర్థి వేలూరు మహేష్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నక్కలోళ్ళ సెంటర్, బృందావనం ప్రాంతాల్లో.. పలు నివాసాలు, వాణిజ్య దుకాణాలు, హాస్పిటల్స్‌కు వెళ్ళి ప్రజలకు వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధిని వివరించే కరపత్రాలు పంపిణీ చేశారు. ఎప్పుడో అమావాస్య -పౌర్ణమికి ప్రజలను చూసి వెళ్లే నాయకులను కాకుండా.. ప్రజలకు నిరంతరం అందు బాటులో ఉండే వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ 61వ డివిజన్ అభ్యర్థి వేలూరు ఉమామహేష్‌ని, వైసీపీ మేయర్ అభ్యర్థి ఆనం విజయకుమార్‌రెడ్డిని గెలిపించాలని ఆయన ప్రజలకి విజ్ఞప్తిచేశారు. అధికారి పార్టీ చేస్తున్న ఆగడాలు, దౌర్జన్యాలు అన్నిన్ని కావని, వారికి సామాన్య ప్రజల సమస్యలు అవసరం లేదని టీడీపీపై ఆయన విమర్శలు చేశారు.

# నేత్రపర్వం..'శ్రీ రాజరాజేశ్వరి' అలంకారం

### ఆలూరు వారి నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు





విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 20న నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరమ్మవారి దేవాలయంలో ప్రముఖ దాతలు, అమ్మవారి భక్తులు ఆలూరు కుటుంబసభ్యుల నేతృత్వంలో ప్రత్యేక పూజలు జరిగాయి. తొలుత ఆలయ అర్చకులు అమ్మవారిని నేత్రపర్వంగా అలంకరించి మహాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారికి విశిష్టమైన శ్రీ రాజరాజేశ్వరి అలంకారాన్ని నిర్వహించారు. ఆలూరు గిరీష్‌కుమార్‌రెడ్డి-లత, ఆలూరు మహేష్‌కుమార్‌రెడ్డి-రాధిక దంపతుల ఉభయకర్తృత్వంలో అమ్మవారికి చేసిన శ్రీ రాజరాజేశ్వరిదేవి అలంకారం భక్తులను బాగా ఆకట్టుకుంది. అదేవిధంగా, శ్రీ సుందరేశ్వరస్వామి ఆలయంలో శ్రీ లలితా కుంకుమార్చన మహాన్యాస పూజలు కన్నులపండువగా జరిగాయి. ఈ పూజలకు దాతలు కంఠాబత్తుని మల్లికార్జునరెడ్డి-లలిత (హైదరాబాదు)లు ఉభయకర్తలుగా వ్యవహరించారు. దేదీప్యమానంగా జరిగిన ఈ ఉత్సవ వేడుకలను డీఆర్‌డీఏ మాజీ ఛైర్మెన్ సతీష్‌రెడ్డి, ఎన్నికల పరిశీలకురాలు సదాభార్గవి, సీఐడి విభాగం ఎస్పీతో పాటు నెల్లూరు ఆర్డీఓ అనూష, పలువురు న్యాయమూర్తులు తిలకించి తరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నూతలపాటి శ్రీధర్‌నాయుడు, ముఖ్య ఉత్సవ అధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి, ఆలయ ఛైర్‌పర్సన్ ఏలూరు శిరీష, ధర్మకర్తల మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీలో చేరిన వారికి మంచి గుర్తింపు!

### ➤ మంత్రి ఆనం భరోసా!



తెలుగుదేశం పార్టీలో చేరిన ప్రతి నాయకుడికి, కార్యకర్తకు సముచిత గుర్తింపు, గౌరవం కల్పిస్తామని మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి భరోసా ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీలో చేరేందుకు పలువురు వైసీపీ వారు కూడా ఉత్సాహం చూపుతుండడం గమ నార్హం. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి చెందిన పలువురు ప్రముఖ నాయకులు, ముఖ్య కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో ఇటీవల తెలుగుదేశం పార్టీలో చేరడంతో ఆత్మకూరు రాజకీయవర్గాల్లో సందడి మొదలైంది. ఇటీవల ఆత్మకూరు పట్టణం లోని రవితేజ కల్యాణ మండపంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సమ క్షంలో వైసీపీకి చెందిన పలువురు కీలక నాయకులు, ప్రముఖులు, కార్యకర్తలతో పాటు దాదాపు 200 కుటుంబాలు తెలుగు దేశం పార్టీలో చేరాయి. వారందరికీ మంత్రి ఆనం స్వయంగా పసుపు కండువాలు కప్పి తెలుగుదేశం పార్టీలోకి సాదరంగా ఆహ్వా నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజారంజక పాలన, ఆత్మకూరు నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయ కులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా తెలుగు దేశం పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ఆత్మకూరు పట్టణ సమగ్ర అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులు ఘనవిజయం సాధిస్తారని తనకు నమ్మకం ఉందని అన్నారు. ఈ కార్యక్ర మంలో ఆత్మకూరు పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ నాయ కులు, ఆనం అభిమానులు పాల్గొన్నారు.

**మరో 50 కుటుంబాలు!**

అనంతసాగరం మండలం వెంగం పల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 50 కుటుంబాలు ఇటీవల తెలుగుదేశం పార్టీలో చేరాయి. ఆ గ్రామా నికి చెందిన సానా నారాయణరెడ్డి ఆధ్వ ర్యంలో ఈ కుటుంబాలు నెల్లూరులోని మంత్రి ఆనం నివాసానికి చేరుకుని తెలుగు దేశం పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా ఆ గ్రామస్తులు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్ర మాలు, ఆత్మకూరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై తెదేపాలో చేరినట్లు తెలిపారు.

### పోత పోసిన

# అయ్యప్ప స్వామి!



నెల్లూరులోని వేదాయపాళెంలో ఉన్న శ్రీ అయ్యప్పస్వామి వారి దేవస్థానంలో శ్రీ స్వామివారికి నూతన పంచలోహ ఉత్సవ విగ్రహం నిర్మాణ పోత కార్యక్రమం ఘనంగా జరిగింది. దీంతో ఇకనుంచి పోతపోసిన కొత్త అయ్యప్పస్వామి భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయం అధ్యక్షులు గూడల శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకట రత్నం, కోశాధి కారి గడ్డం రత్తయ్య, ఉపాధ్యక్షులు పీటీ జగన్నాథం పూజలు నిర్వహించిన అనం తరం, భక్తుల సమక్షంలో అయ్యప్ప శరణు ఘోషల మధ్య పుటం ద్వారా బంగారు వెండి రాగి ఇత్తడి సీసం పంచలోహం కరిగించి విగ్రహం పోత పోశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు శంకరన్ విజయ కుమార్, మురళిరెడ్డి, ప్రసాదు, అశోక్ కుమార్‌లతో పాటు పెద్దసంఖ్యలో అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ వైఫల్యాలను..

# ప్రజలకి వివరించండి

### ■ పార్టీ శ్రేణులకు రామ్‌కుమార్‌రెడ్డి పిలుపు ■



వైకాపా నుండి పోటీ చేయనున్న అభ్యర్థులతో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకి వివరించాలని వైసీపీ నేత.. వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పార్టీశ్రేణులకి పిలుపునిచ్చారు. ఎన్నికల రంగంలోకి దిగిన పార్టీ అభ్యర్థులకు ఆయన ఇటీవల వెంకటగిరిలోని ఎన్‌జేఆర్ భవన్‌లో దిశానిర్దేశం చేశారు. వెంకటగిరి మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపుతూ, 36 వార్డుల్లో అభ్యర్థులుగా బరిలో నిలిచిన పార్టీ నాయకులు, శ్రేణులకు తగు సూచనలిచ్చారు. ప్రజల మన్ననలు పొందేలా ప్రతి అభ్యర్థి ప్రచార కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలను తెలుసు కోవాలని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు అందించిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకి వివరించా లన్నారు. పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని చూరగొనాలని, ప్రతి వార్డులో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని ఆయన సూచించారు.

# విఆర్‌సి వాకర్స్..20వ వసంతోత్సవం




కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న విఆర్‌సి వాకర్స్

నెల్లూరు విఆర్‌సి గ్రౌండ వాకర్స్ అసోసియేషన్ 20 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఇటీవల గ్రౌండ్‌లో వాకర్స్ వారు సంబరాలు జరుపుకున్నారు. ర్యాలీ జరిపి కేక్ కటింగ్, మిఠాయిలు పంచుకొని వాకర్స్‌తో పండుగ చేసుకొన్నారు. వాకర్స్ అసోసియేషన్ మొదటి అధ్యక్షులు డాక్టర్ సిహెచ్ భాస్కరరావు, వాకర్స్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, నేతాజీ సుబ్బారెడ్డి, అమ్మ ఫర్నిచర్ అధినేత గడ్డం సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షల తేదీలు వచ్చేశాయ్!

ఏపీలో ఇంటర్ వార్షిక పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. ఫస్టియర్ పరీక్షలు ఫిబ్రవరి 24 నుంచి మార్చి 15 వరకు,, సెకండియర్ పరీక్షలు ఫిబ్రవరి 25 నుంచి మార్చి 16 వరకు జరగనున్నాయి. ఫస్టియర్ పరీక్షలు ఫిబ్రవరి 24, 26, మార్చి 1, 3, 5, 9, 12, 15వ తేదీ వరకు, సెకండియర్ పరీక్షలు ఫిబ్రవరి 25, 27, మార్చి 2, 4, 8, 11, 13, 16 తేదీ వరకు జరుగుతాయని ప్రకటించారు.

# 'నే'తల'రాతలు' మార్చనున్న స్థానిక సమరం!

(మొదటిపేజీ తరువాయి)

పదవులను ఆశిస్తున్న సీనియర్ ఎమ్మెల్యేలకు కూడా స్థానిక ఎన్నికల ఫలితాలు తమ రాజకీయ పట్టును నిరూపించుకునే అవకాశంగా మారవచ్చన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

### కూటమికి అసలు పరీక్ష సమన్వయమే!

టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి ప్రభుత్వాన్ని నడుపుతున్నప్పటికీ.. స్థానిక ఎన్నికల్లో ఈ పార్టీల మధ్య సీట్ల పంపకం, అభ్యర్థుల ఎంపిక, స్థానిక నాయకుల ప్రాధాన్యం వంటి అంశాలు కీలకంగా మారాయనడంలో సందేహం లేదు. రాష్ట్ర స్థాయిలో కూటమి ఐక్యత ఒకటైతే, గ్రామం లేదా వార్డు స్థాయిలో స్థానిక నేతల మధ్య పోటీ మరో అంశం. ఒకే స్థానంపై రెండు లేదా మూడు పార్టీల నాయకులు ఆశలు పెట్టుకున్నప్పుడు అసంతృప్తి తలెత్తడం సహజం. అలాంటి పరిస్థితుల్లో టికెట్ దక్కని నాయకులు కూటమి అభ్యర్థికి సహకరిస్తారా? ఓట్ల బదిలీ ఎంతవరకు సాధ్యమవుతుంది? అన్న ప్రశ్నలకు ఎన్నికల ప్రక్రియ సమాధానం చెప్పనుంది. సాధ్యమైనన్ని స్థానాల్లో ఏకాభిప్రాయంతో అభ్యర్థులను నిలబెట్టుకోవాలని పార్టీలు ప్రయత్నించినప్పటికీ, ఏకగ్రీవాల సంఖ్య ఒక్కటే ప్రజాదరణకు కొలమానం కాదు. పోటీ జరిగిన చోట్ల ఓటర్ల మద్దతు, గెలుపు మార్జిన్, స్థానిక సమస్యలపై అభ్యర్థుల అవగాహన కూడా రాజకీయ బలాన్ని అంచనా వేయడానికి ఉపయోగపడతాయి. ఏకగ్రీవాల విషయంలోనూ అవి స్వచ్ఛందంగా, చట్టబద్ధంగా జరిగాయా అన్నది ముఖ్యమే. పోటీకి అవకాశం లేకుండా ఒత్తిళ్లు తెచ్చారనే ఆరోపణలు తలెత్తితే అవి రాజకీయ వివాదాలకు దారితీయవచ్చు.

### వైఎస్సార్‌సీపీకి క్షేత్రస్థాయి బలానికి పరీక్ష

ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి స్థానిక ఎన్నికలు సంస్థాగత బలాన్ని చాటుకునే కీలక వేదికగా నిలవనున్నాయి. గత ఎన్నికల్లో తమకు అనుకూలంగా ఉన్న ప్రాంతాల్లో ప్రస్తుత పరిస్థితి ఎలా ఉంది? గ్రామ, వార్డు స్థాయిలో పార్టీ నిర్మాణం ఎంతవరకు నిలకడగా ఉంది? నాయకుల మధ్య సమన్వయం ఉందా? కార్యకర్తల్లో ఉత్సాహం ఏ స్థాయిలో ఉంది? అన్న అంశాలు ఆ పార్టీకి కీలకం కానున్నాయి. ఇదే సమయంలో కొందరు స్థానిక నాయకులు పార్టీలు మారుతున్నారన్న ప్రచారం కూడా రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. ముఖ్యంగా ఉత్తరాంధ్రలో నాయకుల రాజకీయ పునర్వ్యవస్థీకరణపై చర్చ సాగుతున్నట్లు సమాచారం. అయితే వ్యక్తిగతంగా పార్టీ మారిన నాయకుల సంఖ్యకంటే, వారి వెంట ఎంతమంది కార్యకర్తలు, స్థానిక ఓటర్లు నిలుస్తారన్నదే ఎన్నికల ఫలితాల పరంగా అసలు ప్రశ్న. పార్టీ మార్పులు రాజకీయ చర్చకు దారితీసినా వాటిని ఓట్ల రూపంలోకి మార్చుకోవడం అంత సులభం కాదు.

### బీసీ రిజర్వేషన్లు.. కొత్త నాయకత్వానికి అవకాశం?

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అంశం మరో కీలక రాజకీయ చర్చగా మారింది. వెనుకబడిన తరగతులకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలన్న డిమాండ్ చాలాకాలంగా ఉంది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల అమలు బీసీ నాయకత్వానికి కొత్త అవకాశాలకి తలుపులు తెరిచాయన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. రిజర్వేషన్లు అమలులోకి రావడం ఒక ముఖ్యమైన అడుగు అయినప్పటికీ, బీసీ వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం పెరగాలంటే అభ్యర్థుల ఎంపికలో పార్టీల చొరవ, గెలిచిన ప్రజాప్రతినిధులకు నిర్ణయాధికారాల్లో లభించే స్థానం, స్థానిక సమస్యలపై వారు చూపే ప్రభావం కూడా అంతే ముఖ్యం. కేవలం సీట్లు కేటాయించడం కాకుండా, రాజకీయంగా ఎదగడానికి అవసరమైన అవకాశాలను కల్పించగలిగితేనే రిజర్వేషన్ల లక్ష్యం మరింత సార్థకమవుతుంది.

### మంత్రివర్గ విస్తరణపై స్థానిక ఫలితాల నీడ?

స్థానిక ఎన్నికల ఫలితాలు రాష్ట్ర మంత్రివర్గ విస్తరణపై ప్రభావం చూపవచ్చన్న చర్చ రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యం సంతరించుకుంటోంది. జిల్లాల్లో పార్టీ బలాన్ని పెంచిన నాయకులు, కూటమి సమన్వయానికి కృషిచేసిన నేతలు, వెనుకబడిన ప్రాంతాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం వంటి అంశాలు భవిష్యత్తులో పార్టీ నాయకత్వం పరిశీలించే అంశాలుగా ఉండవచ్చు. ముఖ్యంగా బీసీ వర్గాలకు ప్రాతినిధ్యం పెరగాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తే, సామాజిక సమీకరణలు కూడా మంత్రివర్గ కూర్పులో చర్చకు రావచ్చు. అయితే స్థానిక ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు సాధించిన ప్రతి నాయకుడికి మంత్రి పదవి దక్కుతుందని, తక్కువ స్థానాలు వచ్చిన ప్రతి నేతకు పదవి కోల్పోయే పరిస్థితి వస్తుందని ముందుగానే నిర్ణయించడం సాధ్యం కాదు. మంత్రివర్గ కూర్పు అన్నది రాజకీయ, ప్రాంతీయ, సామాజిక, పరిపాలనా అంశాల సమ్మేళనం. అయినప్పటికీ స్థానిక ఎన్నికలు నాయకుల పనితీరు, ప్రజాదరణ, పార్టీ వ్యవస్థపై వారి పట్టును అంచనా వేయడానికి ఉపయోగపడే రాజకీయ సూచికగా నిలిచే అవకాశం ఉంది.

### అంతిమంగా ప్రజల తీర్పే కీలకం!

స్థానిక సంస్థల ఎన్నికలను రాజకీయ పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడం సహజం. కానీ ఈ ఎన్నికల అసలు ఉద్దేశం గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి సమర్థులైన ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడం. తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్య, ఆరోగ్యం, స్థానిక ఉపాధి, ప్రభుత్వ పథకాల అమలు వంటి అంశాలపై అభ్యర్థులు ఏమి చేయగలరు? ప్రజలకు అందుబాటులో ఉంటారా? స్థానిక సమస్యలను పరిష్కరించగలరా? అన్నది ఓటర్లు పరిశీలించాల్సిన ముఖ్యమైన అంశాలు. అధికార పక్షానికి ఈ ఎన్నికలు పాలనపై ప్రజల స్పందనను తెలుసుకునే అవకాశమైతే, ప్రతిపక్షానికి తన క్షేత్రస్థాయి బలాన్ని నిరూపించుకునే వేదిక. కూటమి పార్టీలకు పరస్పర సమన్వయం సవాలుగా నిలిస్తే, బీసీ నాయకత్వానికి రిజర్వేషన్లు కొత్త అవకాశాలపై ఆశలు కలిగిస్తున్నాయి. ఈ పరిణామాలన్నీ రాష్ట్ర రాజకీయాల్లో భవిష్యత్తు సమీకరణలకు దోహదపడవచ్చు. మొత్తంగా స్థానిక సమరం కొందరు నేతల రాజకీయ ప్రాధాన్యాన్ని పెంచవచ్చు, మరికొందరిని తమ వ్యూహాలను పునఃసమీక్షించుకునేలా చేయవచ్చు. అయితే ఎవరి 'తలరాత' ఎలా మారుతుందన్నది ప్రచారాలకో, అంచనాలకో పరిమితం కాదు. ఎన్నికల నిర్వహణ, కూటముల సమన్వయం, ప్రజా సమస్యలపై స్పందన, చివరికి ఓటర్ల తీర్పు ఈ నాలుగు అంశాలే స్థానిక సమరానికి అసలు దిశను నిర్దేశించనున్నాయి. అయితే ఈ స్థానిక ఎన్నికలు మాత్రం ఆశావహులకి అగ్నిపరీక్ష లాంటివే అన్న మాట అటు రాజకీయ వర్గాలలోనూ ఇటు పార్టీ శ్రేణులలోనూ వినపడడం గమనార్హం...!

# శతవసంతాల శేషేంద్ర



***"అందమైన పోయెం అంటే***
***దానికి ఒక గుండె ఉండాలి***
***అది కన్నీళ్ళు కార్చాలి***
***క్రోధాగ్నులు పుక్కిలించాలి***
***పీడితుల పక్షం వహించాలి***
***మనిషి ఋణం తీర్చుకోవాలి"*** – కవిత్వానికి శేషేంద్రశర్మ గారి నిర్వచనం ఇది. పోయెంకు గుండె వుండటమంటే సమాజాన్ని కదిలించే చైతన్య స్పృహ వుండటం. కవిత్వం కన్నీళ్ళు కార్చడమంటే కరుణ రసాత్మకం కావడం. క్రోధాగ్నులు పుక్కిలించడమంటే లోకంలోని అన్యాయాలు, అక్రమాలు, హింస, దోపిడీలపై కవి ఆగ్రహించడం. మనిషికి అండగా నిల్చి మానవీయ కోణాన్ని ఆవిష్కరించడం. ఈ లక్షణాలన్నీ సలక్షణంగా వున్న శేషేంద్రశర్మ కవిత్వం యుగ ధర్మాన్ని ప్రతిబింబించింది. కవిత్వాన్ని కాలాతీత కాంతిరేఖగా నిలిపింది. ఆధునిక అభివ్యక్తులతో కవిత్వానికి విప్లవభాషను నేర్పింది. కవిత్వం కాలక్షేపం దినుసు కాదని, అది ప్రజల చేతిలో పాశుపతం లాంటి ఆయుధమని ఋజువు చేసింది.

శేషేంద్రగా ప్రఖ్యాతికెక్కిన గుంటూరు శేషేంద్రశర్మ ఈ శతాబ్దాన్ని వెలిగించిన మహాకవి. శబ్దాల్ని మైనపు ముద్దల్లా చేసి, అద్దాలకు ఆర్ద్రతనద్ది, హృదయాలను కవిత్వంతో రసాప్లావితం చేసిన కవి. కలంతో కాలపత్రం మీద చెరగని సంతకం చేసిన మనతరం మహాకవి. ప్రవాహవేగంతో పద్యాన్ని నడిపిన కవి. వచన కవిత్వంలోని అన్ని ప్రయోగాలకు, ప్రతీకలకు, పోకళ్ళకు అక్షర సాక్షిగా నిలిచిన కవి. అచ్చతెనుగు వేషంతోనే కాదు, అచ్చమైన భాషతో కవిత్వానికి గౌరవం పెంచిన కవి.

డా॥ శేషేంద్రశర్మ 1927 అక్టోబరు 20న నెల్లూరుజిల్లా తోటపల్లి గూడూరులో సుబ్రహ్మణ్యశర్మ, అమ్మాయమ్మ దంపతులకు సంప్రదాయ కుటుంబంలో జన్మించారు. బాల్యం నుండి పురాణేతిహాసాలు, కావ్యాలు, శాస్త్రాలు చదివారు. స్వయంకృషితో పాండిత్యం సాధించారు. ప్రాచీన సంస్కృతాంధ్ర కవుల్ని కంఠరథ్యంగా చదివారు. భారతీయ ఆలంకారిక శాస్త్రాన్ని, పాశ్చాత్య సిద్ధాంతాలతో సమన్వయించి కావ్య విమర్శకు కొత్త వాకిళ్ళు తెరిచారు.

***"ఈ దేశం మట్టిలో నా మాటలు చల్లుతాను***
***అవి కత్తుల్లై మొలకెత్తుతాయి. పూలగుత్తులై పరిమళిస్తాయి"*** అంటారు. కవి మాటకు ఎంత శక్తి వుందో చెబుతారు.

***"ఓ చెట్టు! మీరు పూలెందుకు పూస్తారు – బుల్లెట్లెందుకు పూయరు?"*** అన్న సరి కొత్త సామాజిక విప్లవాన్ని ప్రశ్నగా సంధిస్తారు.

శేషేంద్ర నిరంతర కవి. నిత్య పరిణామశీలి. ఓ కాళిదాసు, ఓ తిక్కన, ఓ పోతనలా కవిత్వం కోసం పుట్టిన కారణజన్ములు. శేషేంద్రకు కవిత్వం ఓ జీవన విధానం. బతుకుతెరువు కాదు. కాళిదాసు శ్లోకానికి శోభనిస్తే, శేషేంద్ర కాలస్పృహతో పద్యాన్ని ప్రకాశింప చేశారు. వారి ఋతుఘోష ఓ రసఘోష, శేషజ్యోత్స్న, మండే సూర్యుడు, గొరిల్లా, షోడశి, జనవంశమ్ వంటి రచనలు శేషేంద్రను విలక్షణ కవిగా, విమర్శకునిగా నిలిపాయి. "నా దేశం – నా ప్రజలు" శేషేంద్ర జీవితకాల కవితా తపస్సు. "నేను నా జీవితంలో రాసిన ఒకే ఒక మహాకావ్యం నా దేశం – నా ప్రజలు" అని సగర్వంగా చాటుకున్నారు. "కవిసేన మానిఫెస్టో" కొత్తతరం కవులకు సిలబస్ లాంటిది. "నన్ను అర్థం చేసుకునేవాళ్ళు నా వెంట నడుస్తారు. సరికొత్తగా రాస్తారు" – అంటారు మానిఫెస్టోలో. "నా దేశం – నా ప్రజలు" చదివాక వంగి సలాము చేసే వాళ్ళు నిటారుగా నిలబడతారంటారు. అంటే కవిత్వం మనిషికి వెన్నెముక లాంటిదని శేషేంద్ర అభిప్రాయం.

రష్యాను సమూలంగా మార్చిన బోల్షివిక్ విప్లవం అక్టోబరులో పురుడుపోసుకుంది. మన శేషేంద్ర అక్టోబరులోనే పుట్టారు. ప్రపంచ కార్మిక శక్తిని చాటిన మేడే నెలలో శేషేంద్ర కాలం చేశారు. రెండు విప్లవాల మధ్య జ్యోతిలా తెలుగు కవిత్వాన్ని కాంతివంతం చేశారు.

శేషేంద్రకు రావలసినంత గుర్తింపు రాలేదని, జ్ఞానపీఠం వరించలేదని వారి అభిమానుల ఆవేదనలో సత్యం వుంది. కాని పాఠకుల హృదయపీఠంపై శాశ్వత స్థానం పొందిన శేషేంద్రను అవార్డులు కొలవలేవు – పురస్కారాలు తూచలేవు.

కాలపు మేకులకు వేలాడే కవులతో శేషేంద్రను పోల్చలేం.

***"నదులు కనే కలలు ఫలిస్తాయి పొలాల్లో***
***కవులు కనే కలలు ప్రతిఫలిస్తాయి కలాల్లో"***

అవును. శేషేంద్ర కలం, గళం తెలుగు జాతికి గర్వం. శేషేంద్ర కవిత్వాన్ని పునర్మూల్యాంకనం చేయాలి. శేషేంద్ర సృష్టించిన సరికొత్త శాబ్దిక, భావగర్భిత, విప్లవాత్మక, ధ్వని గర్భిత కవిత్వం అర్థం కావాలంటే మెదడుతో కాదు, రసహృదయంతో చదవాలి. గుండె వాకిళ్ళు తెరవాలి. శత వసంతాలు నిండిన మండే సూర్యుడికి ఆత్మీయ అక్షరాంజలి.

(గుంటూరు శేషేంద్రశర్మ శతజయంతి సందర్భంగా..)



**డా॥ బీరం సుందరరావు**
**చీరాల. సెల్ : 98480 39080**

## మినీ ఆయిల్‌మిల్స్‌కు..
# 33 శాతం రాయితీలు

జిల్లాలో నూనెగింజల ప్రాసెసింగ్‌ను ప్రోత్సహించేందుకు, నూనెల తయారీ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు, తద్వారా రైతులకు అదనపు ఆదాయ అవకాశాలు కల్పించేందుకు జాతీయ నూనెల మిన్– నూనెగింజల పథకం (ఎన్‌ఎంఇఒ–ఒఎస్) పథకం కింది తగు ఆర్థికసాయం అందించేందుకు కృషి జరుగుతోంది. వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ పి.సత్యవాణి ఈనెల 21న ఒక ప్రకటనలో ఆ వివరాలు తెలిపారు. ఈ పథకం ద్వారా రైతు ఉత్పత్తి దారుల సంఘాలు, సహకార సంఘాలు, వ్యక్తిగత రైతులు, సంస్థలు, ఇతర అర్హులైన లబ్ధిదారులు ప్రయోజనం పొందవచ్చన్నారు. అందుకు సంబంధం చిన మినీ ఆయిల్‌మిల్స్, నూనె తీసే యూనిట్లు, నూనెగింజల ప్రాసెసింగ్, యంత్రాల కొనుగోలుకు ఆ ప్రాజెక్టు వ్యయంలో 33శాతం రాయితీ ఉంటుందని, గరిష్ఠంగా సుమారు 9.90 లక్షల వరకు ఆర్థిక సాయం అందుతుందని ఆమె వివరించారు. రోజుకు 10టన్నుల సామర్థ్యం కలిగిన నూనె తయారీ యూనిట్ల ఏర్పాటుకు ఈ సహాయం వర్తిస్తుందని తెలిపారు. తక్కువ సామర్థ్యం కలిగిన ఆయిల్ మిల్స్‌కి కూడా అందుకు అనుగుణంగా సాయం ఉంటుందన్నారు. వివరాలకు ఆయా మండల వ్యవసాయాధికారులు లేదా జిల్లా వ్యవసాయాధికారులను సంప్రదించవచ్చని ఆమె వివరించారు.

# పెరసం పోస్టర్ ఆవిష్కరణ

నెల్లూరులోని పెన్నా రచయితల సంఘం (పెరసం) 17వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 21న స్థానిక ప్రెస్‌క్లబ్‌లో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కవితా సంపుటాల పోటీలో ఉత్తమంగా ఎంపికైన కవి బిల్ల మహేందర్‌కి పురస్కారం ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు అవ్వారు శ్రీధర్‌బాబు, గోవిందరాజు సుభద్రాదేవి వివరించారు. ఆ సభకి తిరుపతికి చెందిన ప్రొఫెసరన్ బీసీ వెంకటేశ్వర్లు, నెల్లూరులోని ప్రముఖ నవలారచయిత్రి డా. పెళ్లకూరు జయప్రద, కళారత్న చిన్ని నారాయణరావు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డా. గంగిశెట్టి శివకుమార్, విశ్రాంత ఏఎస్పీ కొల్లూరు శ్రీనివాసరావు తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. పోస్టర్ల ఆవిష్కరణలో కవులు ఇంద్రగంటి మధుసూదన్, కె.అంకబాబు, మునీంద్ర, కవయిత్రి పార్లపల్లి నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# ప్రథమ వర్ధంతి



## తిక్కవరపు జనార్ధన్‌రెడ్డి గారు

నిర్యాణం : 27.10.2025

మీరిచ్చిన స్ఫూర్తి.. మీరందించిన కీర్తి.. మీరు మిగిల్చిన జ్ఞాపకాలతో..
**ప్రథమ వర్ధంతి** సందర్భంగా మిమ్మల్ని స్మరించుకుంటూ...

**తిక్కవరపు మంజుల** – భార్య

**తిక్కవరపు వంశీరామ్** – కుమారుడు
ఎం.డి – వంశీరామ్ హోమ్స్

**తిక్కవరపు శ్రుతిరెడ్డి** – కోడలు

**తిక్కవరపు ఆర్యన్‌రామ్‌రెడ్డి** – మనుమడు

మరియు **కుటుంబసభ్యులు**

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com